తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# విబేధాలు లేవు!

## కలసి భక్తులసేవకే పనిచేస్తున్నాం
## -టిటిడి ఛైర్మన్, ఈఓ,అదనపు ఈఓ



తిరుమల,జనవరి 13ప్రభాతవార్తప్రతినిధి:
పాలకమండలి, అధికారులు కలసి భక్తులకు సౌకర్యవంతమైన సేవలందించడానికి సమన్వయంతో పనిచేస్తున్నామని టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు వెల్లడించారు.సామాన్యభక్తులకు త్వరితగతిన, సంతృప్తికరంగా దర్శనం చేయించడానికి మేమంతా కలసి పనిచేస్తున్నామని ఆయన తెలిపారు. తిరుపతిలో 8వతేదీ రాత్రి తొక్కిసలాట ఘటన జరిగిందని, అంతమాత్రాన పాలకమండలి,అధికారుల మధ్య విబేధాలు ఉన్నట్లు ప్రచారం చేయడం మంచిదికాదని టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు ఒకింత అసహనం చెందారు. కొన్ని పత్రికల్లో, సామాజికమాధ్యమాల్లో టిటిడి ఛైర్మన్‌కు,ఈఓకు మధ్య మనస్పర్థలు ఉన్నాయంటూ వార్తలు రాయడం సరికాదన్నారు. సోమవారం మధ్యాహ్నం అన్నమయ్యభవనంలో టిటిడి ఈఓ జె.శ్యామలరావు, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరితో కలసి ఛైర్మన్ బిఆర్‌నాయుడు సమిష్టిగా మీడియాప్రతినిధుల సమావేశం నిర్వహించారు.తిరుపతిలో జరిగిన తొక్కిసలాటలో ఇద్దరు బాధితులు తప్ప మిగిలిన వారందరూ చికిత్స పొంది డిష్చార్జి అయ్యారని, అందరికీ పరిహార అందించి, స్వామివారి వైకుంఠద్వారదర్శనం చేయించామన్నారు. తిరుమల విషయంలో ఒకటికి రెండుసార్లు పరిశీలించి ,సంబంధిత వ్యక్తుల నుండి వాస్తవ సమాచారాన్ని తెలుసుకుని వార్తలు రాయాలని సూచించారు. పాలకమండలిలో కూడా సమిష్టిగా చర్చించి నిర్ణయాలు తీసుకుంటున్నామని చెప్పారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పన, మరింతగా మంచి పనులు చేపట్టే విషయంలో టిటిడిలో పాలకమండలిలో చర్చించి తీసుకునే నిర్ణయాలను అమలు చేయడం తమ బాద్యత అని టిటిడి ఈఓ శ్యామలరావు తెలిపారు. ఛైర్మన్,ఈఓ మధ్య ఎలాంటి మనస్పర్థలు లేవని, సమన్వయలోపం అస్సలు లేదన్నారు. భక్తుల రద్దీకి తగ్గట్లు ఎక్కువ సమయం వేచిఉండకుండా త్వరితగతిన స్వామివారి దర్శనం కల్పించేందుకు చూస్తున్నామని టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి తెలిపారు. భక్తులకు మరింత పారదర్శకంగా వసతి గదులు కేటాయింపులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వారి వాట్సాప్‌కే పూర్తిసమాచారం, రిజిస్ట్రేషన్ చేసే ఏర్పాట్లు జరుగుతున్నాయని అదనపు ఈఓ తెలిపారు. ఈ మీడియా సమావేశంలో ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, సిపిఆర్ఓ డాక్టర్ తలారి రవి, పిఆర్ఓ నీలిమ, విఎస్ఓ అల్లంసురేంద్ర పాల్గొన్నారు.

# కొండపై టిటిడి ఛైర్మన్ భోగిమంటలు



తిరుమల,జనవరి 13ప్రభాతవార్తప్రతినిధి: సాంప్రదాయమైన భోగిపండుగను టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు భక్తులతో కలసి జరుపుకున్నారు. సోమవారం వేకువజామున 4గంటలకు తిరుమలలోని ఛైర్మన్ క్యాంపు కార్యాలయం వద్ద భోగిమంటలు వేశారు.

# ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆటవిడుపు

## సొంతూరులో నారా భవనేశ్వరీ ఆటల పోటీలు
## విద్యార్థులకు బెలూన్ బ్లాస్టింగ్, మ్యూజికల్ ఛైర్ పోటీలు



చంద్రగిరి, జనవరి 13 ప్రభాతవార్త:
నిత్య జీవితంలో బిజీబిజీగా గడిపే మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ఆటవిడుపు లభించడంతో తన సతీమణి నారా భువనేశ్వరితో సోమవారం కలసి ఆటల పోటీలను వీక్షిస్తూ ఆనందించారు. సంక్రాంతి సంబరాలను సొంతూరులో జరుపుకునేందుకు తమ కుటుంబంతో సహ నారావారిపల్లికి చేరుకున్నారు. ఈ నేపథ్యంలో భోగిపండుగ రోజున విద్యార్థులతో బెలూన్ బ్లాస్టింగ్, మ్యూజికల్ ఛైర్స్, పొటాటో గ్యాదరింగ్, గన్నీబ్యాగ్ రేస్, లెమన్ స్పూన్, తదితర ఆటలను నిర్వహించారు. ఆద్యంతం సరదాగా వీక్షించిన నారా దంపతులు పిల్లల పోటీతత్వాన్ని గమనించి మనసారా నవ్వుకున్నారు. ఈ పోటీలను ఆసక్తిగా తిలకిస్తున్న నారా దేవాన్ష విద్యార్థులను ఉత్సాహపరుస్తూ ఆనందించాడు. అదేవిధంగా పరిసర గ్రామాలకు చెందిన మహిళలు సంప్రదాయ గొబ్బిళ్ళ పాటలతో అలరించారు. ఈ పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి నారా దంపతులు బహుమతులు అందజేసి అభినందించారు. అంతకుముందు దంపతులు మాట్లాడుతూ సంప్రదాయాలను కొనసాగించడం, మన వారసులకు సంపదగా అందించడమే లక్ష్యంగా సంక్రాంతి సమయంలో ఇటువంటి పోటీలను నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, నారా బ్రాహ్మిణీ, నందమూరి వసుంధర, ఎంపి దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎంఎల్ఏలు పులివర్తి నాని, అమర్‌నాద్ రెడ్డి, గాలి భానుప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

# ఆయన రూటే సపరేటు...!

- ఇది తిరుపతి జిల్లా ఇన్‌చార్జి డ్వామా పీడీ తీరు
- నాడు చెవిరెడ్డి నేడు పులివర్తి అండదండలతో
- ఉపాధి హామీ పథకానికి తూట్లు పొడుస్తున్న పీడీ
- కింది స్థాయి అధికారులు, సిబ్బందిపై నిత్యం సస్పెన్షన్‌వేటు
- మరో ఇద్దరి నూతన ఉద్యోగులకు పనిచేయకుండానే జీతాలు




తిరుపతి కలెక్టరేట్, ప్రభాతవార్త :
ఆయన ఓ శాఖకు జిల్లా అధికారి. ఇంకా పూర్తి స్థాయి బాధ్యతలు ఇవ్వలేదు.ఇన్‌చార్జిగానే విధులు నిర్వహిస్తున్నారు.అయితే ఆయన నా రూటే సఫరేటు అన్న తరహాలోనే పనిచేస్తున్నారు. నన్ను ఏ ఉన్నత అధికారి,ఏ రాజకీయ నాయకుడు ఎవరూ ఏమీ అనరనే కాన్సెప్ట్‌తో ముందుకు వెళుతున్నారు. గత ప్రభుత్వంలో నాటి చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అండదండలు, నేడు అదే నియోజకవర్గ ఎమ్మెల్యే పులివర్తి నాని అండదండలున్నట్లు సమాచారం. అతను ఎవరో కాదు. మన తిరుపతి జిల్లా నీటి యాజమాన్యం సంస్థ (డ్వామా) ఇన్‌చార్జి పీడీ. ఇతను బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి నేటి వరకు ఎంతో మంది తన క్రింది స్థాయి అధికారులు, సిబ్బందిని సస్పెండ్ చేస్తూ వెళుతున్నారు. సస్పెండ్‌కు గురైన వారి చేత ఈనెలలో ఉద్యోగంలోకి తీసుకుంటూ, రేపు నెలలో ఉద్యోగంలోకి తీసుకుంటానంటూ నమ్మబలుకుతూ కొన్ని నెలలు నుంచి దాదాపు రెండు సంవత్సరాల పాటు కూడా పనులు చేయించుకుంటున్నారు. కాలం గడుస్తున్నా వారిని తిరిగి విధుల్లోకి తీసుకోక వారి కుటుంబ ఆర్థిక పరిస్థితిని చిన్నాభిన్నం చేస్తున్నారు. ప్రస్తుతం సస్పెండ్‌కు గురైన నలుగురు ఆర్థిక పరిస్థితి దయనీయంగా ఉందని చెప్పక తప్పదు. జిల్లాలో ఆ విభాగంలో సిబ్బంది కొరత ఉన్నప్పటికీ ఇంటి పని చేయడానికి ఒక వంట మనిషిని, చెట్లకు నీళ్లు పెట్టడానికి ఒక మనిషిని,తన బ్యాంకు, ఇతర పనులు చేయడానికి మరో మనిషిని, ఇలా ముగ్గురు ఉద్యోగులను తన ఇంటి పనివాళ్ళుగా మార్చుకున్నాడు. అంతే కాకుండా గత ప్రభుత్వంలో ఇద్దరు కొత్త ఉద్యోగులను తీసుకుని వారు విధులు నిర్వహించకనే నిర్వహిస్తున్నట్లు జీతాలు ఇస్తున్నట్లు తెలుస్తోంది.చివరికి తన సామాజిక వర్గ భజన బృందంతో నిత్యం డప్పులు కొట్టుకుంటూ మిగతా అధికారులు, సిబ్బంది పట్ల, మహిళా ఉద్యోగుల పట్ల ఆయన ప్రవర్తిస్తున్న తీరుపై మహిళా ఉద్యోగులు సైతం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి పీడీ తూట్లు పొడుస్తున్నారు. సస్పెండ్‌కు గురై ఆయన పెడుతున్న బాధలను తట్టుకోలేక ఆత్మహత్యలే శరణ్యమని అంటున్న తిరుపతి జిల్లాలోని కొంత మంది బాధిత ఏపీవోలు,జేఈల కథనాల మేరకు వివరాల్లోకి వెళితే...చిత్తూరు తిరుపతి ఉమ్మడి జిల్లాలో గతంలో ప్రస్తుత తిరుపతి జిల్లా డ్వామా పీడీ చిత్తూరు జిల్లా అదనపు పీడీగా పనిచేస్తుండే వారు. అటు పిమ్మట తిరుపతి జిల్లా ఇన్‌చార్జి పీడీగా బాధ్యతలు చేపట్టారు..ఆ నాటి నుంచి నేటి వరకు జిల్లాలో తన క్రింది స్థాయి ఏపీవోలు, జేఈలను ముప్పు తిప్పలు పెతున్నాడు. జిల్లాలో ఆ విభాగంలో కంప్యూటర్ ఆపరేటర్స్, టెక్నికల్ అసిస్టెంట్స్, ఇంజనీర్లు, క్రింది స్థాయి సిబ్బంది కొరత ఉన్నా, ఉన్న సిబ్బందితో ఆయన సక్రమంగా విధులు నిర్వర్తించలేక ఏపీవోలు, జేఈలపై నిత్యం దుర్భాషలాడుతున్న తెలుస్తోంది.. డ్వామాలో జరుగుతున్న పనితీరుపై జిల్లా కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్ వెంటనే స్పందించి తగు విచారణ జరిపి పీడీపై తగు చర్యలు తీసుకోవాలని సస్పెండ్‌కు గురైన బాధిత ఏపీవోలు, జేఈలు జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేస్తున్నారు. డ్వామాలో పనిచేస్తున్న ఏపీవోలు, జేఈల సస్పెండ్‌గల కారణాలపై పీడీని ఫోన్‌లో ప్రభాతవార్త అడిగేందుకు ప్రయత్నించగా ఎటువంటి సమాధానం లేదు.

మరిన్ని వివరాలతో....2వ భాగంలో

## కాణిపాకంలో శాస్త్రసోక్తంగా
# సత్యనారాయణవ్రతం



కాణిపాకం, జనవరి 13 ప్రభాతవార్త:
ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి ఆలయంలో సోమవారం సత్యనారాయణవ్రతంను శాస్త్రోక్తంగా అత్యంత ఘనంగా నిర్వహించారు. ప్రధాన ఆలయం అనుబంధ ఆలయమైన శ్రీశ్రీదేవి భూదేవి సయిత వరదరాజస్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా ఈవ్రతాన్ని నిర్వహించారు. ఆలయ మండపంలో ఈవ్రతాన్ని అర్చకులు వేదపండితుల మంత్రోచ్ఛారణ నడుమ ఘనంగా నిర్వహించారు. ఈమేరకు ఆలయంలో అర్చకులు స్వామి, అమ్మవార్ల మూలవిరాట్‌లకు ఉదయం ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఆలయ మండపంలో వుంచి సత్యనారాయణవ్రతంను నిర్వహించారు. ఈసందర్భంగా సత్యనారాయణస్వామి వ్రత మహత్యాన్ని అర్చకులు భక్తులకు వివరించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, వేదపండితులు తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా పున్నమి గరుడసేవ

శ్రీశ్రీదేవి భూదేవి సయిత వరదరాజస్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా సోమవారం రాత్రి పున్నమి గరుడసేవను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో సత్యనారాయణ వ్రతంను నిర్వహించగా రాత్రి గరుడసేవను నిర్వహించారు. ఆసందర భంగా అలంకరించిన స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను గరుడవాహనంపై వుంచి మంగళ వాయిద్యాల నడుమ ఊరేగించారు. ఈకార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

# సమష్టి కృషితో ఫ్లెమింగో ఫెస్టివల్‌ను విజయవంతం చేస్తాం

## - ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ



సూళ్లూరుపేట, జనవరి 13 ప్రభాతవార్త
పులికాట్ విశిష్టతను చాటుతూ సూళ్లూరుపేట కేంద్రంగా నిర్వహిస్తున్న ఫ్లెమింగో ఫెస్టివల్‌ను విజయవంతం చేసేందుకు అధికారులు, ప్రజలు, పార్టీ నేతలు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆమె ఫ్లెమింగో ఫెస్టివల్‌కు వేదిక కానున్న జూనియర్ కాలేజి మైదానంలో ఫ్లెమింగో ఫెస్టివల్ పనులను కొబ్బరికాయలు కొట్టి, ప్రత్యేక పూజలు చేసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో జరిగిన ఫ్లెమింగో ఫెస్టివల్ కంటే మిన్నగా ప్రస్తుతం ఫెస్టివల్ చేయాలన్నదే తమ అందరి సంకల్పమని తెలిపారు. ఇందుకోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేసి పండుగను విజయవంతం చేయాలన్నారు. జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఆధ్వర్యంలో ఇప్పటికే వివిధ కమిటీలను వేసి ఉన్నారని, ఈ కమిటీల ద్వారా పండుగ పనులను త్వరితగతిన చేయడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం సమయం తక్కువగా ఉండటంతో ఈ నాలుగు రోజుల్లోనే పండుగ పనులను చేసే విధంగా ప్రణాళికలు రూపొందించుకోవాలని అధికారులను ఆమె కోరారు. ఈ సందర్భంగా ఫ్లెమింగో ఫెస్టివల్ ప్రచార పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. కేవలం పండుగతోనే సరిపెట్టుకోకుండా పులికాట్, నేలపట్టుల అభివృద్ధితో పాటు అక్కడి ప్రజల అభివృద్ధి, సూళ్లూరుపేట పట్టణ ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు పరిష్కరించేందుకు ఫ్లెమింగో ఫెస్టివల్‌ను వేదికగా చేసుకొని పని చేయాలని యోచిస్తున్నట్లు విజయశ్రీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపి నెలవల సుబ్రహ్మణ్యం, టిడిపి నేతలు తిరుమూరు సుధాకర్‌రెడ్డి, ఆకుతోట రమేష్, ఎజి కిషోర్, ఎస్.విజయభాస్కర్‌రెడ్డి, బిజెపి నేతలు తాటిపర్తి ఆదినారాయణరెడ్డి, అక్కిరాల కిరణ్‌కుమార్ గౌడ్, దంతాల రవి, కె.శ్రీధర్, మున్సిపల్ కమిషనర్ కె.చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

# భక్తి శ్రద్ధలతో శివయ్య జన్మ నక్షత్ర అభిషేకాలు

## -విశేష సంఖ్యలో భక్తుల దర్శనాలు





శ్రీకాళహస్తి,జనవరి 13 ప్రభాతవార్త
శ్రీకాళహస్తీశ్వరాలయంలో భోళాశంకరుని జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు.సోమవారం శివయ్యకు ప్రీతిపాత్రమైన రోజుగా భక్తుల నమ్మకం. ఆదివారం రాత్రి నుంచే భక్తులు చేరుకున్నారు.వేకువ జామునుంచి భక్తులు కడలితరంగాల్లా కదలి వచ్చారు.ఉద్దిపిండి లింగానికి జరిగే నేయ్యాభిషేకానికి భక్తులు విశేష సంఖ్యలో హాజరయ్యారు.ఆలయంలో వెలసిన మూలవిరాట్టుకు విశేష అభిషేకాలు అలంకారాలు జరిపారు. శివయ్య జన్మ నక్షత్రమైన ఆరుద్ర సందర్భంగా ఆలయంలో బుధవారం వేకువ జాము నుంచి విశేష కార్యక్రమాలు నిర్వహించారు. వేకువ జాము 3గంటల నుంచే దర్శనానికి అనుమతించారు. గోపూజ జరిపి జేగంట,శుద్ధి కార్యక్రమాలు నిర్వహించి సర్వదర్శనానికి అనుమతించారు. సూర్యోదయానికి ముందు స్వామి గర్భగుడిలో మూల విరాట్టుకు ముందు ఉద్దిపిండితో తయారు చేసిన శివలింగాన్ని ప్రతిష్టించారు. ఆ లింగానికి స్థానిక ఆచారం మేరకు శాస్త్రోక్తంగా నెయ్యితో అభిషేకం జరిపారు.విశేష అభిషేకాన్ని తిలకించుటకు స్థానిక భక్తులు విశేష సంఖ్యలో హాజరయ్యారు.ధనుర్మాసం కావటంతో వేకువ జాము నుంచి పట్టణ నలుమూలల నుంచి మహిళలు విశేష సంఖ్యలో పాల్గొంటారు. సోమవారం స్వామి జన్మనక్షత్రం సందర్భంగా భక్తులు మహాశివరాత్రి లా దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఇఓ టి బాపిరెడ్డి ఆదేశాలతో స్థానిక ఎఇఓలు లోకేష్‌రెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి టెంపుల్ ఇన్స్పెక్టర్ హరియాదవ్ సుదర్శనం నాయుడు భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక భక్తులతో పాటు తమిళనాడు,కర్నాటక రాష్ట్రాల నుంచి భారీ ఎత్తున భక్తులు హాజరై ఉత్సవాల్ని తిలకించారు.తరువాత ఆలయంలోని నటరాజస్వామి ఆలయం ఎదురుగా విశేష సంఖ్యలో షోడషాభిషేకాలు నిర్వహించారు. సూరి గురుకుల్ సారథ్యంలో అభిషేకాలు జరిపారు.అంతకు ముందు అక్కడ హోమాలు నిర్వహించారు. ఆలయ గురుకుల్ డాక్టర్ స్వామినాధన్ గురుకుల్ శాస్త్రోక్తంగా పూజలు హోమాలు నిర్వహించారు. కలశాల్లోని నీటితో అభిషేకాలు జరిపారు.

### గ్రామోత్సవం:

శ్రీకాళహస్తీశ్వరాలయంలో జరిగే ఆరుద్ర సందర్భంగా నటరాజస్వామికి అభిషేకాలు నిర్వహించిన తరువాత గ్రామోత్సవం నిర్వహించటం ఆనవాయితి.ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం పట్టణంలో నటరాజస్వామిని అంగరంగ వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. సరికొత్త తరహాలో డమురకాలు వాయిస్తూ పట్టణంలోని వీధులు దద్దరిల్లజేసారు.







కాణిపాకంలో వైభవంగా గోదాదేవి కళ్యాణం
శ్రీ.శ్రీ.శ్రీ ముత్యాలమ్మ ఆలయంలో విశేష పూజలు
వైభవంగా అరికట్ల ఉత్సవం 4లో
ఘాట్‌లో తిరగబడిన ఆర్టీసి బస్సు
పట్టీల కోసం యువత పోరాటం 2లో
ఎక్సైజ్‌కు సవాల్‌గా మారుతున్న కర్నాటక మద్యం...

## నగిరిపల్లి నుంచి నారావారిపల్లి భారీగా తరలి వెళ్లిన తెలుగు తమ్ముళ్లు

సోమల, జనవరి 13, ప్రభాతవార్త



సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపేందుకు మండలంలోని పలువురు తెలుగుదేశం నాయకులు తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్ కుమార్ రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపేందుకు పోటీలు పడి మరి తరలి వెళ్లారు. సంక్రాంతి సందర్భంగా ఆయన తన స్వగ్రామమైన నగిరిపల్లిలోని ఉండడంతో ఆయనకు కార్యకర్తలు తరలివెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే అక్కడ నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిసేందుకు నారావారిపల్లెకు పలు వాహనాల్లో కార్యకర్తలు నాయకులు తరలి వెళ్లారు. మరి కొంతమంది పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి ని కలిసేందుకు వెళ్లారు. నగిరిపల్లికి తరలిన వారిలో జిల్లా సర్పంచుల సంఘ మాజీ అధ్యక్షుడు యదు శేఖర్ నాయుడు, హరి ప్రసాద్, ద్వారక తదితరులు ఉన్నారు.

## ఘనంగా భోగి పండగ.. గ్రామాల్లో ప్రజల ఉత్సాహం

కుప్పం, జనవరి 13 ప్రభాతవార్త

సంక్రాంతి పండగకు ముందుగా జరుపుకునే భోగి పండగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. తమ ఇళ్లల్లోని పాత సామ గ్రిని తొలగించడంతో పాటు వాటిని భోగి మంటల్లో వేశారు. ఈసందర్భంగా ఇళ్ల ముందర వివిధ వర్ణాలతో కూడిన రంగవల్లులను మహిళలు తీర్చి దిద్ది అందులో గొబ్బెమ్మలను గుమ్మడి పువ్వును అలంకరించారు. గ్రామాలతో పాటు కుప్పం పట్టణంలో సైతం మంగళవారం వేకువజామున నుంచే జనం భోగి మంటలు వేస్తూ ఉత్సాహంగా కన్పించారు. కుప్పం మండలం కంగుంది, మటార్లపల్లి గ్రామాల్లో ధనుర్మాసం సందర్భంగా నిర్వహించే భజన కార్యక్రమాలు ముగిశాయి. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలను భక్తజన బృందం నిర్వహించారు.

**రామకుప్పం:** మండలంలోని గ్రామాల్లో భోగి పండగను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మహిళలు రంగరంగుల ముగ్గులు వేశారు. స్థానిక శ్రీకాశీ విశ్వేశ్వరాలయంలో పౌర్ణమి పూజలు జరిపారు. స్వామివారికి రుద్రాభిషేకం, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై శివనామస్మరణతో మార్మోగించారు. నిర్వాహకులు భక్తులకు అన్నదాన వసతి కల్పించారు.

## బంగానత్తంలో ఘనంగా రంగవల్ళుల పోటీలు.



కుప్పం రూరల్,జనవరి13,ప్రభాతవార్త: మండలంలోని బంగానత్తం గ్రామంలో భోగిపండుగ సందర్భంగా గ్రామసర్పంచ్ రోహిత్‌రవి ఆధ్వర్యంలో మహిళలకు పెద్దఎత్తున రంగవళ్ళుల పోటీలు నిర్వహించారు.మహిళలు పెద్దసంఖ్యలో హాజరై అందమైన రంగవళ్ళులు వేశారు. అనంతరం విజేతలుగా నిలిచిన మహిళకు మెదటిబహుమతిగా రూ.3001 రూపాయలు జ్ఞాపికఅందించారు.మెత్తం 15మంది మహిళలకు నగదు బహుమతులు అందించారు.ఈ సందర్భంగా గ్రామంలో సందడి నెలకొంది.కాగా గ్రామాల్లోప్రజల సౌకర్యార్థం 30చోట్ల కూర్చునేందుకుగాను సిమెంటు దిన్నెకుర్చీలను ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ తెలిపారు.కార్యక్రమంలో గ్రామస్థులు మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

## కాపుమొండివెంగనపల్లెలో మొదలైన .... జల్లికట్టు

వెదురుకుప్పం, జనవరి 13 ప్రభాతవార్త :



మండలంలోని కాపుమొండివెంగనపల్లెలో సంక్రాంతి పండుగ పురష్కరించుకుని నిర్వహించే జల్లికట్టు పందెలను సోమవారం భోగి పండుగనాడే మొదలు పెట్టడంతో యువకులు రెట్టించిన ఉత్సహంతో గిత్తలతో పోటీకి దిగడంతో ఆట మొదలైయింది. మండలంలోని కాపుమొండి వెంగన పల్లెలో తొలి రోజు భోగి పండుగ నాడు పశువుల పోటీలు నిర్వహించడంతో గ్రామంకు పెద్ద సంఖ్యలో జనం తరలిరావడంతో సంక్రాంతి శోభ సంతరించుకంది. గ్రామంలో యువకులు గ్రామంకు మాడితోరణాలు, రంగు కాగితాలు అంటించి పశువుల పోటీలకు గ్రామంకు అందంగా ముస్తాబు చేశారు. రైతులు తమ కోడిగిత్తలకు కొమ్ములు చెక్కి రంగులు వేసి వివిధ అంకరణతో ముస్తాబు చేయడంతో పాటు కొమ్ములకు తమ ఇష్టామైన రాజకీయ నాయకులు, దేవుళ్ళ, సినిమా హిరోల చిత్రాలతో కూడిన చెక్కపట్టీలను కట్టించి అలంకరించారు. కొందరు రైతులు గిత్తలకు టవల్, నగదు బహుమతులు కట్టి పోటీకి దించారు. పోరుగు గ్రామాల నుంచి గిత్తలను పందెలకు తీసుకురావడం జరిగింది. అల్లె కుస్తీకి సిద్ధమైన యువకులు ఉత్సహంతో ఊలలు, కేరింతలతో పౌరుషంతో పోటీలకు దిగడంతో గ్రామస్థులు గిత్తలను వదలి పెట్టారు. రెంటించిన పౌరుషంతో గిత్తలు జనంను చీల్చుకుంటు దప్పుల దరువులు మధ్య పరుగులు తీశాయి. యువకులు పట్టుజారకుండా గిత్తలను పట్టుకోవడంకు ప్రయత్నాలు చేశారు. గిత్తలను నిలువరించే ప్రయత్నంలతో కొందరు యువకులు చిన్న చ్చిన్న గాయాలు పాలైవడం జరిగింది. చుట్టప్రక్కాల మండలాలు, తిరుపతి జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో పోటీలు తిలకించడంకు జనం రావడంతో పల్లెకు సంక్రాంతి శోభసంతరించుకుంది. వీక్షకులకు గ్రామస్థులు కావలసిన మంచినీటి, భోజన సదుపాయలు కల్పించారు.

## పోటుగారి గంగయ్య మృతి పార్టీకి తీరని లోటు

వెదురుకుప్పం, జనవరి 13 ప్రభాతవార్త :



గంగాధర నెల్లూరు నియోజకవర్గం టిఎన్‌టీయూసీ ఉపాధ్యక్షులు పోటుగారి గంగయ్య గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందడం తెలుగు దేశం పార్టీకి తీరని లోటని టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి భీమినేని చిట్టిబాబు నాయుడు అన్నారు. మండలంలోని మొండివెంగనపల్లె పంచాయితీ పరిధిలోగల బండమీదిండ్లకు చెందిన గంగయ్య సోమవారం గుండెపోటుకు గురై మృతిచెందడం సమాచారం తెలిసి అక్కడికి చెరుకుని మృతదేహంకు పూలమాలవేసి ఘనంగా నివాళి అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగఢ సానుభూతి తెలిపారు. ఆయనతో పాటు నియోజకవర్గం యువత అధ్యక్షులు గురసాల కిషన్‌చంద్,పలువురు నాయకులు పాల్గొన్నారు.

## విరూపాక్షమ్మకు ప్రత్యేక పూజలు

కల్లూరు, జనవరి 13, ప్రభాతవార్త



పులిచెర్ల మండలం దేవలంపేట పంచాయతీ దిగువమూర్తివారి పల్లి శ్రీ విరుపాక్షమ్మ ఆల యంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు ఫణి ప్రకాష్ శర్మ పూజా కార్యక్రమాలు నిర్వహిం చారు.

## అర్ధగిరిలో వైభవంగా పౌర్ణమి వేడుకలు

తవణంపల్లె, జనవరి 13 ప్రభాతవార్త:



ప్రముఖ పుణ్యక్షేత్రమైన అరగొండ అర్ధగిరి శ్రీవీరాంజనేయస్వామి దేవస్థానంలో సోమవారం పౌర్ణమి వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి. ప్రతి నెలా ఆలయంలో పౌర్ణమి వేడుకలు నిర్వహించడం ఆనవాయితీ. ఈమేరకు ఆలయ ఈఓ టి.హనుమంతురావు ఆధ్వర్యంలో ఈవేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో ప్రధాన అర్చకులు వేణుగోపాలాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం స్వామివారి మూలవిరాట్‌కు శాస్త్రోక్తంగా పంచామృతాభిషేకం, పూజలు నిర్వహించి ధూప దీప నైవేద్యాలను సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు. అలాగే అర్చకులు ఉదయం 11 గంటలకు ఆలయ మండపంలో సుదర్శనహోమం, ఆకుపూజ, వడమాలసేవ, మధ్యాహ్నం సహస్రనామార్చన, ఆకుపూజ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అలాగే రాత్రి స్వామివారికి ప్రాకారోత్స వంను ఘనంగా నిర్వహించారు. ఈమేరకు అలంకరించిన స్వామివారిని ప్రత్యేక పల్లకిపై వుంచి ఆలయం, సంజీవరాయని పుష్కరిని చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. . ఈకార్యక్రమంలో ఆలయ మాజీ ఛైర్మన్ సురేంద్రరెడ్డి,అధికారులు, అర్చకులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

## తవణంపల్లెలో ముసురు వర్షం

తవణంపల్లె, జనవరి 13 ప్రభాతవార్త:



బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ప్రభావంతో మండలంలోని పలు ప్రాంతాలలో సోమవారం ఉదయం నుండి ముసురు వర్షాలు కురుస్తూ వుంది. ఎన్నడూ లేని విధంగా సంక్రాంతి పండుగ రోజున మండలంలో ముసురు వర్షాలు కునుస్తూవుంది.సాయంత్రంఐదు గంటల నుండి ఎడతెరపి లేకుండా వర్షం కురవడంతో సంక్రాంతి పండుగకు వచ్చి వెళ్లే ప్రజలు తీరవ్ర ఇబ్బందులు పడ్డారు. అలాగే మండలంలోని అరగొండ, తవణంపల్లెలో సోమవారం జరిగే వారపు సంతలో వర్షాల వల్ల వ్యాపారస్థులు, కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షాకాలం సీజన్ ముగియడంతో జనవరి నెలలో వర్ ్షం కురవడం అరుదు. అయితే గతంలో ఎన్నడూ లేని విధంగా జనవరి నెలలో వర్షం కురవడంతో అందరిని ఆశ్చర్యానికి గురి చేసింది. ఈవర్షాల వల్ల మామిడి పంటకు నష్టం వాటిల్లే ప్రమాదముందని రైతులు తెలిపారు.

## తవణంపల్లెలో ఘనంగా భోగి సంబరాలు

తవణంపల్లె, జనవరి 13 ప్రభాతవార్త:

తెలుగింట పెద్దపండుగ సంక్రాంతి పండుగలో భాగంగా సోమవారం మండల ప్రజలు భోగిపండుగను సంప్రదాయబద్దంగా అత్యంత ఘనంగా జరుపుకున్నారు. సంక్రాంతి పండుగ పర్వదినాన్ని తెలుగు ప్రజలు నాలుగు రోజుల పాటు సంప్రదాయంగా నిర్వహించుకోవడం ఆనవాయితీ. ఈమేరకు తొలిరోజు సోమవారం భోగిపండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. ఇందులో భాగంగా వేకువజామున ప్రజలు తమ ఇంటిల్లపాది కలసి ఇంటి ముందు బోగిమంటలు వేశారు. అలాగే పలు గ్రామాలలో భజన బృందాలు, గ్రామస్థులు వీధుల్లో తిరుగుతూ భజనలు చేశారు. ఈసందర్భంగా సంప్రదాయం ఉట్టిపడే విధంగా మహిళలు తమ ఇంటిముందు రంగవల్లులను తీర్చిదిద్దారు.

## కుప్పంలో సంక్రాంతి సందడి.. జనంతో కిటకిట

కుప్పం, జనవరి 13 ప్రభాతవార్త

కుప్పం పట్టణం సోమవారం గ్రామీణ ప్రాంత జనంతో కిటకిటలాడింది. తెలుగువారు జరుపుకునే పెద్ద పండగల్లో ఒకటైన సంక్రాంతి పండగ రావడంతో ప్రజలు పండగను జరుపుకునేందుకు అవసరమైన సరుకులు, దుస్తులు, ఇతరాల కోసం భారీ ఎత్తున కుప్పం చేరుకున్నారు. ఉదయం నుంచి రాత్రి దాకా పట్టణంలోని నేతాజీ రోడ్, రాధాకృష్ణరోడ్, రామచంద్రారోడ్ ప్రాంతాలు ప్రజలతో కిటకిటలాడుతూ కన్పించాయి. చెరకుగడలు, బెల్లం తదితరాల విక్రయాలు జోరుగా సాగాయి. మంగళవారం సంక్రాంతి, బుధవారం కనమ పండగ నేపథ్యంలో ఇప్పటికే వివిధ ప్రాంతాలకు జీవనోపాధి నిమిత్తం వెళ్లిన జనం స్వగ్రామాలకు చేరుకున్నారు. దీంతో పల్లెల్లో సందడి కన్పిస్తోంది.

## గల్లా అరుణ స్వగ్రామంలో ఘనంగా సంక్రాంతి సంబరాలు

తవణంపల్లె, జనవరి 13 ప్రభాతవార్త:



మాజీ మంత్రి గల్లా అరుణకుమారి స్వగ్రామం మండలంలోని దిగువమాఘంలో సోమవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా ప్రారంభమయ్యాయి.ప్రతి ఏటా గల్లా అరుణ కుటుంబీకులు గ్రామస్థులతో కలసి సంక్రాంతి పండుగను జరుపుకోవడం ఆనవాయితీ. ఈమేరకు గల్లా అరుణకుమారి, గల్లా రామచంద్రనాయుడు దంప తులు, మాజీ ఎంపీ గల్లా జయదేవ్, కుమారుడు సినీ హీరో గల్లా అశోక్‌లు, గౌరినేని రమాదేవిలు గ్రామస్థులతో కలసి భోగి సంబరాలను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఈమేరకు గల్లా ఇంటి ముందు సోమవారం వేకువజామున గ్రామస్థులతో కలసి భోగి మంటలు వేశారు. అలాగే అరుణకుమారి గ్రామస్థులతో కలసి కోలాటం గొబ్బియల్లు వంటి సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని ఆడి పాడారు. ఈకార్యక్రమంలో గౌరినేని హర్ష, గౌరినేని విక్రమ్‌లతో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## గుండెపోటుతో ఒకరు.. అనారోగ్యంతో మరొకరు...!

చౌడేపల్లి, జనవరి 13 ప్రభాతవార్త



గుండె పోటుతో ఒకరు, అనారోగ్యంతో మరొకరు మృతి చెందగా వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయి. మండంలోని ఎ.కొత్తకోట పంచాయతీ మంచినీళ్ళపల్లికి చెందిన గంగరాజు(38) పొలానికి వెళుతూ గుండెపోటుతో మృతి చెందాడు. పంచాయతీ కేంద్రం ఆమినిగుంట సుబ్రమణ్యం(మణి)(35) ఇంట్లో నిద్రిస్తూ హఠాత్మరణం చెందాడు. దీంతో ఇరువురి కుటుంబాలు వీధిన పడ్డాయి. మృతులిద్దరూ కూలీ పనులు చేసుకొంటూ జీవనం సాగిస్తున్నారు, మృతుల కుటుంబాల వారిని ప్రభుత్వం ఆదుకోవాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.

## ప్రభుత్వ హామీలు నెరవేర్చే దిశగా ఉద్యమించాలి

మాజీ మంత్రి పెద్దిరెడ్డి



చౌడేపల్లి, జనవరి 13 ప్రభాతవార్త

ప్రభుత్వ హామీలు నెరవేర్చే దిశగా ఉద్యమించాలని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మండలంలోని పంచాయతీ కేంద్రం పుదిపట్లకు చెందిన ఉదయ్‌కుమార్‌రెడ్డిని పుంగనూరు నియోజకవర్గ కార్యనిర్వహణా కార్యదర్శిగా నియమించిన విషయం విధితమే. దీంతో ఆయన మాజీ మంత్రి పెద్దిరెడ్డి ఆశీస్సులు తీసుకొనేందుకు తిరుపతిలోని నివాసంకు వెళ్ళారు. ఎన్నికల్లో కూటమి నాయకులు ప్రజలకు చేసిన వాగ్దానాలను ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక హామీలను తుంగలోకి తొక్కారన్న అంశాన్ని సమాజంలోకి తీసుకెళ్ళాల్సి న అవసరం అందరిపై వుందన్నారు. ముఖ్యంగా సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చేలా ప్రజలతో కలసి పోరాడాల్సి న అవసరం వచ్చిందన్నారు. సమిష్టి కృషితో ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలన్నారు. అనంతరం రాజంపేట ఎంపి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిలను కలసి ఆశీర్వాదం తీసుకొన్నారు. మాజీ మండలాధ్యక్షుడు కూరపర్తి అంజిబాబు, ఉపాధ్యక్షులు నరసింహులుయాదవ్, సుధాకర్‌రెడ్డి, కళ్యాణ్‌భరత్, రవిచంద్రారెడ్డి, శేఖర్, పరికిదొన బాబు, వైకాపా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్దలతో భోగి పండుగ

చౌడేపల్లి, జనవరి 13 ప్రభాతవార్త

మనిషిలోని అహంకారాన్ని అణచివేసి సుఖశాంతులతో జీవితాన్ని గడిపేందుకు అవసరమయ్యే శక్తినిచ్చే భోగి పండుగను మండల వ్యాప్తంగా ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. ఉదయాన్నే ఇళ్ళముందు భోగి మంటలు వేసుకొని భక్తిని చాటుకొన్నారు. దేవస్థానాలకు వెళ్ళి విశేష పూజాది కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని మృత్యుంజయేశ్వరస్వామి, బోయకొండ గంగమ్మ, రాజనాలబండ ప్రసన్న ఆంజనేయస్వామి, శ్రీలక్ష్మీనరరసింహస్వామి, కమల, అభయాంజనేయస్వామి, పుదిటపట్ల పంచలింగేశ్వరస్వామి, వైష్ణవీదేవీ, లద్దిగం జలకంఠేశ్వరస్వామి, శెట్టిపేట మోక్షగణపతి తదితర ఆలయాల్లో భోగి సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు.

## డిపో నుంచి తిరుమన్నామలై ఐదు బస్సులు

పుంగనూరు, జనవరి 13, ప్రభాతవార్త



పౌర్ణమి సందర్భంగా తమిళనాడు రాష్ట్రం తిరుఅణ్ణామలై క్షేత్రానికి పుంగనూరు నుండి శుక్రవారం ఐదు బస్సులు బయలుదేరాయి. వాటిని స్థానిక ఆర్టిసి బస్టాండ్‌లో డిపో మేనేజర్ సుధాకరయ్యా పూజలు చేసి ప్రారంభించారు. ప్రతి నెల పౌర్ణమి రోజు గిరి ప్రదక్షణ కోసం వెళ్లే భక్తులు ముందస్తుగా టికెట్లు బుక్ చేసుకోవడంతో స్పెషల్‌గా బస్సులు ఏర్పాటు చేశామని చెప్పారు. తీర్థ క్షేత్ర యాత్రలకు వెళ్లేభక్తులు, విహారయాత్రలు వెళ్లే వారు ముందుకు వచ్చి తెలియజేస్తే బస్సు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

## ఎక్సైజ్‌కు సవాల్‌గా మారుతున్న కర్నాటక మద్యం...

పుంగనూరు, జనవరి 13 ప్రభాతవార్త:



ఎడతెరపిలేకుండా ఎడాపెడా రవాణా అయిపోతున్న నాటు సారా కర్ణాటక మద్యంజిల్లా ఎన్ఫోర్స్ మెంట్ తో పాటు స్థానిక ఎక్సైజ్అధికారులకు కంటి నిద్ర లేకుండా చేస్తోంది. అప్పుడప్పుడు అధికారుల నిర్వహించే మెరుపుతనిఖీలలో ఎడపెడ లభిస్తున్న నటసార అక్రమ మద్యం ఇందుకు నిదర్శనం. పాతుకు పోయిన పాతసారా నేరగాళ్లు, ముదిరిపోయిన కర్ణాటక మద్యం సరఫరా నేరస్తులు వెరసి పుంగనూరు ప్రాంతాలలో నాటు, కర్ణాటకల కిక్కును పెంచేస్తున్నారు. ఎక్సైజ్ అధికారులు ఎప్పుడు దాడి చేసిన లభిస్తున్న నాటు సారా ఊట, నాటక మద్యం ప్యాకెట్లు గుట్టలు అధికారులకు సిబ్బందికి కంటికి నిద్రలేకుండా చేస్తున్నాయి. తాజాగా సోమవారం ఉదయం నుంచి అధికారులు నిర్వహించిన దాడులలో సోమల మండలం చెప్పిరెడ్డి పల్లికి చెందిన ప్రవీణ్ అనేది వ్యక్తిని అరెస్ట్ చేసి పది లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నారు. పెద్ద పంజాణి మండలం రాజుపల్లి క్రాస్ వద్ద జరిపిన దాడులలో అక్రమంగా నిల్వ ఉన్న 96. కర్ణాటకవిస్కీ స్వాధీనం చేసుకునే సీజ్ చేసి కోటికి రమణ, పెద్ద గొర్నికుంట, చౌడేపల్లి అనేవ్యక్తి నిఅరెస్టు చేశారు. ఈ దాడులలో పుంగనూరు ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ సురేష్ రెడ్డి పుంగనూరు ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్ ఎం వేణు గోపాల రెడ్డి హెడ్ కానిస్టేబుల్‌లు జే సుబ్రహ్మణ్యం గౌడు, నాగరాజు మరియు కానిస్టేబుల్‌లు, సి. సురేంద్ర బాబు, కిశోర్, వినోద్, శ్వేత మమత .రాజేశ్వరి సిబ్బంది పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## రాజులకండ్రిగ వద్ద లారీ ఢీకొని యువకుడు దుర్మరణం

నారాయణవనం, జనవరి 13 ప్రభాతవార్త :



పుతూ ్తరు-చెన్నై ై జాతీయ రహదారిలోని నారాయణవనం మండలం నారాయణవనం మండలం నైనారుకండ్రిగ పంచాయతీ రాజులకండ్రిగ వద్ద సోమవారం సాయంత్రం తుంబూరు దళితవాడకు చెందిన గోపి కుమారుడు ఎన్ జగదీష్(27) లారీ ఢీకొని మృతి చెందాడు. తుంబూరు నుంచి పుత్తూరులో వున్న తన తల్లి వద్దకు మోటారుసైకిల్‌లో జగదీష్ వెలుతుండగా పుత్తూరు నుంచి ఊతుకోట మీదుగా వెలుతున్న లారీ ఢకొన్నది. ఈ ప్రమాదంలో జగదీష్ అక్కడక్కడే దుర్మరణం చెందాడు. మృతదేహాన్ని పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తెలించారు. ప్రమాదానికి కారణమైనా లారీ డ్రైవర్ ఎన్ చంద్రశేఖర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. స్థానిక ఎస్ఐ రాజశేఖర్ కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

## పట్టీల కోసం యువత పోరాటం

రామచంద్రాపురం, జనవరి 13 ప్రభాతవార్త:



పట్టీలను కైవశం చేసుకునేందుకు యువత పోరాటం చేశారు. సంక్రాంతి సంబరాలలో అరుదైన ఘట్టం పశువుల పండుగను గ్రామీణ యువత ఉత్సహంగా జరుపుకున్నారు. ఇందులో భాగంగా సోమవారం మండలంలోని అనుప్పల్లిలో జల్లికట్టు సంబరాలను వైభవంగా నిర్వహించారు. పాడి రైతు ఎద్దుకు కట్టిన పట్టీని ఒడిసి పట్టుకోవడం కోసం పోటెత్తిన పౌరుషంతో యువత పోరాటమే చేసింది. జల్లికట్టు సంబరాలకు వందలాది పాడి ఆవులను, ఎద్దులను ముస్తాబు చేశారు. ఏడాదికి ఒకమారు పాడిరైతులు జరుపుకునే పశువుల పండుగ రోజున ఏరువాకలో తమకు చేదోడుగా నిలిచి పండిన పంటలను ఇంటికి చేర్చే కాడెద్దులకు పూజలు జరిపించి వాటిలోని ఉత్సాహాన్ని, పౌరుషాన్ని వెలికితీయడమే లక్ష్యంగా జల్లికట్టు సంబరాలు నిర్వహించారు.

# భిన్నత్వంలో ఏకత్వమే సంక్రాంతి పండుగ!

## -నేడు మకర సంక్రాంతి

తొట్టంబేడు, జనవరి 13 ప్రభాతవార్త

ఆంధ్రులకు పెద్దపండుగ సంక్రాంతి. ఈరోజున సూర్యుడు మరక రాశిలోకి ప్రవేశిస్తాడు. ఈరోజుతో దక్షిణాయనం ముగిసి ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభమవుతుంది.ఈరోజు స్వర్గవాకిళ్లు తెరుస్తారని హిందువుల నమ్మకం. 'భిన్నత్వంలో ఏకత్వం' అన్న వాక్యానికి సంక్రాంతి పండుగ బాగా సరిపోతుంది. ఆంధ్రప్రదేశ్, కరా ్ణటకలో సంక్రాంతి అని, తమిళనాడులో పొంగల్ అని, మహారాష్ట్ర, గుజరాత్‌లలో 'మకర్‌సంక్రాంతి' అని పంజాబ్, హర్యానాల్లో 'లోరీ' అని పిలువబడే ఈపండుగను మూడు రోజుల పాటు జరుపుకుంటారు. ఆంధ్రప్రదేశ్‌లో సంక్రాంతిని అత్యంత వైభవంగా జరుపుకుంటారు. ముఖ్యంగా అన్నదాతలు పంటచేతికొచ్చిన ఆనందంలో జరుపుకుంటారు. పండుగరోజు జరుపుకునే మూడు రోజుల్లో మొదటిరోజును భోగి అని, రెండవరోజును సంక్రాంతి అని, మూడవరోజును కనుమ అని పిలుస్తారు. మకర సంక్రాంతితో ఉత్తరాయణం మొదలవుతుంది. భోగి, మకరసంక్రమణం,కనుమ ఈమూడు రోజులు పండుగే. కనుక దీన్ని పెద్ద పెండుగ అంటారు. నిజానికి ధనుర్మాసారంభంతో నెల రోజులు ముందే సంక్రాంతి వాతావరణం చలిచలిగా తెలుగునాట ప్రారంభమవుతుంది. ఈనెలరోజులు తెలుగుపల్లెలు ఎంతో అందంగా, ఆహ్లాదంగా అలరారుతుంటాయి. బుడబుక్కలవారు, పగటివేషదారులు, రకరకాల జానపద వినోద కళాకారులు తయారవుతారు. ఈపండుగకు దాదాపు నెలరోజుల ముందు నుంచే ప్రతి ఇంటి ముందు రంగవల్లులు, గొబ్బెమ్మలతో అలంకరిస్తారు. ముగ్గులు వేయడానికి ప్రత్యేకంగా బియ్యపుపిండిని వాడుతారు. 'సంక్రాంతి' లేదా 'సంక్రమణం' అంటే చేరుట అని అర్థం. 'తత్రమేషాదిషు ద్వాదశ రాశి క్రమణేషు సంచరతః సూర్యస్య పూర్వస్మాద్రాశే ఉత్తరః రాశౌ సంక్రమణ ప్రవేశః సంక్రాంతిః' మేషం మొదలైన 12రాశుల్లో సంచరించే సూర్యుడు ముందున్న రాశి నుంచి తర్వాత రాశిలోనికి ప్రవేశించడమే. సూర్యుని రథయాత్రలో ఘట్టాలు నాలుగు. అవి మేష, తుల, కర్కాటక, మకర సంక్రమణాలు. వీటిలో మరక సంక్రమణాన్ని 'సంక్రాంతి పండుగ'గా వ్యవహరిస్తారు. మార్గశిరం పూర్తికాగానే ఉత్తరాయణం మొదలవుతుంది. సూర్యభగవానుని రథయాత్రలో రెండవ ఘట్టమైన కటక సంక్రమణం నుంచి నాల్గువ ఘట్టమైన మకర సంక్రమణం వరకు గల ఆరు నెలల్ని ఉత్తరాయణం అంటారు. ఉత్తరాయణం దేవతలకు ముఖ్యం కనుక అది ఉత్తర కాలమని చెబుతారు. ఉత్తరాయణ కాలంలో పుణ్యకాలమైన సంక్రాంతి రోజున ధాన్యం, ఫలాలు, విసనకర్ర, వస్త్రం, కాయగూరలు, దుంపలు, నువ్వులు, చెరకులతో పాటు గోదానం చేస్తే సకల శుభాలు కలుగుతాయని నమ్మకం. ఈరోజున పితృదేవతలకు తర్పణాలు వదులుతారు. ప్రతి సంక్రమణానికి పితృతర్పణాలు ఇవ్వాలి. కాని మిగిలిన పదకొండు సంక్రమణాలకు ఇవ్వకపోయినా మరక సంక్రమణానికి మాత్రం తప్పక పితృదేవతలకు తర్పణాలు ఇస్తారు. సంక్రాంతి రోజుల్లో గంగిరెద్దులను ఆడించేవారు వాటిని చక్కగా అలంకరించి ఇంటింటికీ తిప్పుతూ, డోలు, సన్నాయి రాగాలకు అనుగుణంగా వాటిచేత చేయించే నృత్యాలు చూడడానికి రెండుకళ్లచాలవు. ఇక హరిలో రంగహరీ.. అంటూ నెత్తిన తిరుమణి పట్టెలతో, కంచుగజ్జెలు ఘల్లుఘల్లు మనగా చిందులు తొక్కుతూ,చేతుల్లో చిరుతలు కొడుతూ తలపై రాగి అక్షయపాత్ర కదలకుండా హరిదాసులు ప్రత్యక్షమవుతారు. సంక్రాంతి పండుగ వచ్చిందంటే వివిధప్రాంతాల్లో ఉద్యోగరీత్యా నివాసం ఉంటున్న వారు తమ స్వగ్రామాలకు చేరుకుని తమ బంధు మిత్రులతో ఆనందోత్సాహాలతోపండుగను జరుపుకోవడం జరుగుతుంది. ఈనేపథ్యంలో 'ప్రభాతవార్త' అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుతోంది.



# పండుగలు మన తెలుగు సాంప్రదాయాలకు ప్రతీకలు

-తెలంగాణా రాష్ట్ర పంచాయతీరాజ్ మరియు రూరల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్

తొట్టంబేడు, జనవరి 13 ప్రభాతవార్త



మన తెలుగు సంస్కృతి, సాంప్రదాయాలను గుర్తించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలంగాణా రాష్ట్ర పంచాయతీరాజ్ మరియు రూరల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ గుమ్మళ్ళ.సృజన అన్నారు. టిటిడి జెఇఒగా తిరుమలలో సేవలందించి, అటు కర్నూలు జిల్లా కలెక్టర్‌గా, ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శిగా, దేవాదాయశాఖ కమిషనర్‌గా సేవలందించి ప్రస్తుతం పదవీవిరమణ చేసిన జి.బలరామయ్య, తమ కుటుంబసభ్యులతో సంక్రాంతి పండుగరోజున ప్రతి ఏడాది క్రమం తప్పకుండా తమ స్వగ్రామమైన తొట్టంబేడు మండలంలోని పూడి గ్రామానికి వస్తారు. ఈసందర్భంగా ఆయన కుమార్తె తండ్రిబాటలో పయనించి ఆయన్ను ఆదర్శంగా తీసుకుని నేడు తెలంగాణా రాష్ట్ర పంచాయతీరాజ్ మరియు రూరల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ గుమ్మళ్ళ.సృజన ఆధ్వర్యంలో సోమవారం స్వగ్రామం పూడిలో సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మన సంస్కృతి, నాగరికతలకు అనుగుణంగా పండుగను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందని ఇందులో భోగి, సంక్రాంతి, కనుమ పండుగలు ఎంతో ముఖ్యమైనవిగా అభిప్రాయపడ్డారు. నేడు యువత వారివారి ఉద్యోగరీత్యా, కుటుంబబాధ్యతలుకు మాత్రమే పరిమితం అవుతున్నారని రాష్ట్రం గురించి కూడా పట్టించుకోవాలని కోరారు. అనంతరం గ్రామంలోని 'స్పందన స్వచ్ఛంద సేవాసంస్థ', పూడియువజన సేవా సంఘం ఆధ్వర్యంలో గ్రామంలోని యువకులకు,చిన్నారులకు, క్రీడాకారులకు బాల్‌బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, కోకో, చిన్నారులకు మ్యూజికల్‌ఛైర్స్ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. పండుగ సమయాల్లో స్వగ్రామంలో అందరితో గడపడం తమకు ఎంతో ఆనందమని ఆమె వివరించారు. రానురాను పండుగ ప్రాభవం తగ్గిపోతోందని సినిమాలు, టివిల వలన యువత పాశ్చాత్య సంస్కృతికి అలవాటుపడుతోందన్నారు. గత పది సంవత్సరాలుపైగా తాము సంక్రాంతి సంబరాలను నిర్వహిస్తున్నామన్నామని, గ్రామీణ క్రీడలైన గోళీలు, బొంగరాలు, చిల్లంకోడు, కబడ్డీలతో పాటు వాలీబాల్, బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు, మహిళలకు రంగవల్లులు పోటీలు నిర్వహించి నిర్వహించి చిన్నారుల్లో ఉత్సాహాన్ని నింపుతామన్నారు. కార్యక్రమాల్లో మాజీ దేవాదాయశాఖ కమిషనర్ గుమ్మళ్ళబలరామయ్య, న్యాయవాది పి.రవితేజ, స్పందన స్వచ్ఛందసేవాసంస్థ సభ్యులు జలకంబాలమురళీ, జలకం.శ్రీనివాసులు, మాధవయ్య, చక్రి,పలువురు సభ్యులు, గ్రామస్తులు చిన్నారులు పాల్గొన్నారు. కాగా ఆయన్ను దుశ్శాలువ ఎంజిఎం హోటల్ డైరెక్టర్ గుడ్లూరుమల్లికార్జుననాయుడు దుశ్శాలువతో సత్కరించారు.

# పౌర్ణమి సందర్భంగా అన్నదానం

శ్రీకాళహస్తి, జనవరి 13 ప్రభాతవార్త



పట్టణంలోని తేరువీధి బస్‌షెల్టర్ నందు పౌర్ణమి సందర్భంగా జడ్పీఉన్నత పాఠశాల 1994 బ్యాచ్ ఎస్ఎస్‌సి బ్యాచ్ మిత్రబృందం అన్నదాన కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీ. ఈనేపథయంలో భోగిపండుడ మరియు పరమ పవిత్రమైన రోజు ఆరుద్ర, నక్షత్రం మరియు పౌర్ణమి మరియు సోమవారం ఇలా అన్ని కలసి రావడం విశేషాన్ని సంతరించుకుంది. శ్రీకాళహస్తీశ్వరస్వామిఅమ్మవార్ల చిత్రపటాలకు పూజలు నిర్వహించి నైవేద్యం, హారతి సమర్పించి అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. సుమారు 300మంది భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

# ఆకట్టుకున్న సంక్రాంతి కవి సమ్మేళనం

.శ్రీకాళహస్తి, జనవరి 13 ప్రభాతవార్త



పండుగలు మన వారసత్వ సంపద లుగా కాపాడుకుంటూ భవిష్యత్తు తరానికి అందించాల్సిన బాధ్యత మనందిరపైన ఉందని రచయిన, విశ్రాంత తెలుగు పండితులు గొడుగుచింత గోవిందయ్య అన్నారు. సోమవారం ఉదయం పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ధూర్జటి రసజ్ఞ సమాఖ్య సాహితీ కళావేదిక ఆధ్వర్యంలో ప్రధాన కార్యదర్శి యువశ్రీమురళీ అధ్యక్షతన సంక్రాంతి కవి సమ్మేళనం నిర్వహించారు. ఈకవి సమ్మేళనంలో పలువురు కవులు పాల్గొని సంక్రాంతి విశిష్టతను గురించి తెలుగుభాష ఔన్నత్యం, సంస్కృతి సంప్రదాయాలు గురించి సమాజంలో జరుగుతున్న సమకాలీన అంశాలపైన మానవీవ విలువలతో పాటు బాలికలు మహిళలపై జరుగుతున్న అకృత్యాలపై స్వీయకవితలు వినిపించారు. అనంతరం పాల్గొన్న కవులను సత్కరించారు. కార్యక్రమంలో సభ్యులు తీగలవెంకటయ్య, గురునాధం, బాలమునిశివకుమార్, పెళ్ళకూరుమునిసుబ్బారెడ్డి, షణ్ముగం, చెంచుకృష్ణపిళ్ళై, వెంకటస్వామి, రాధాకృష్ణ, గాంధీ, భాస్కర్, శ్రీహరి, రవి, పద్మనాభం, చెంగారెడ్డి, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎంఎల్‌ఏకు రుద్రాక్షమాల అందజేత

శ్రీకాళహస్తి, జనవరి 13 ప్రభాతవార్త



శాసనసభ్యులు బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డిని ఊరందూరులోని ఆయన స్వగృహంలో ఎంజిఎం గ్రూపు అధినేత గుడ్లూరు మల్లికార్జుననాయుడు మర్యాదపూర్వకంగా కలసి ఎంజిఎం హోటల్ తోటలో రుద్రాక్షచెట్ల నుంచి వచ్చిన రుద్రాక్షమాలను అందించి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా బొజ్జలసుధీర్‌రెడ్డి మాట్లాడుతూ హోటల్ ఎంజిఎం గ్రాండ్ నుంచి పక్కన కైలాసగిరుల వరకు 40 అడుగుల రోడ్లు నిర్మిస్తున్నామని స్వర్ణముఖినదికి ఇరువైపులా సుందీకరణ చేసి ఫ్లోటింగ్ బ్రిడ్జిని ఏర్పాటు చేస్తున్నామని వివరించారు.కార్యక్రమంలో బొజ్జలబృందమ్మ, రాంబాబునాయుడు, పలువురు శ్రీకాళహస్తి నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

# కమ్మపల్లిలో అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు

రామచంద్రాపురం, జనవరి 13 ప్రభాతవార్త:



సంప్రదాయాలు, సంస్కృతీ ఉట్టిపడేవిధంగా కమ్మపల్లిలో సోమవారం సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. భోగి పండుగను పురస్కరించుకుని గ్రామస్థులంతా కలసి ఒక ప్రదేశంలో భోగిమంటలు వేశారు. అనంతరం వివిధ రాష్ట్రాలు, దేశాల నుండి వచ్చిన ఆడపడుచులు గ్రామవీధులను రంగవళ్ళులతో సుందరంగా తీర్చిదిద్దారు. అనంతరం గంగిరెద్దు, హరిదాసులు గ్రామవీధులలో కనువిందు చేశారు. మహిళలు గొబ్బిళ్ళ పాటలతో హోరెత్తించారు. మరికొందరు కోలాటాలు, చెక్కభజనలతో అలరించారు. గ్రామాలకు కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల రాకతో సంక్రాంతి శోభతో గ్రామాలు కళకళలాడాయి.

# శ్రీరామనామకీర్తనలతో మర్మోగిన తిరుపతి

తిరుపతి,జనవరి 13ప్రభాతవార్త:



ధనుర్మాసం సందర్భంగా సోమ వారం ఉదయం పెద్దకాపువీధి లోని శ్రీరామమందిరం లో రామనామ కీర్తనలతో మార్మోగింది. భజనమం దిరంలో ఉదయం 5గంటల నుండి 8గంటల వరకు రామనామకీర్తనలను భక్తులు, భజనకళాకారుల, రంగస్థలి కళాకారులు ఆలపించారు. ఉభయదారులుగా శ్రీరామభజనమందిరంలో టిజి కుటుంబసభ్యులు పూజాది కార్యక్రమాలను నిర్వహించారు. ధనుర్మాసంలో రామనామం పలికితే వైకుంఠప్రాప్తి లబిస్తుందని తెలిపారు. అనంతరం రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, తిరుపాల్, కస్పాపద్మనాభం, మునికృష్ణయ్య, భరద్వాజ్, ఉమాపతి ,కెఎస్ రాజ భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

# శివయ్య సేవలో ప్రభుత్వ కార్యదర్శి

శ్రీకాళహస్తి,జనవరి 13 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం ఆరుద్ర సందర్భంగా పలువురు అతిధులు హాజరయ్యారు.ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఆర్.బి.హెచ్.ఎన్ చక్రవర్తి కుటుంబసభ్యులతో హాజరయ్యారు. వారికి దక్షిణ గోపురం వద్ద ఇఒ డి.బాపిరెడ్డి సారధ్యంలో ఎఇఒ విద్యాసాగర్‌రెడ్డి, పిఆర్‌ఒ రవిలు వేదపండితులతో స్వాగతం పలికారు. ఆలయంలో స్వామి వారి గర్భగుడిలో నిర్వహించిన ఉద్దిపిండి లింగానికి నేతి అభిషేకం కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తరువాత నటరాజస్వామికి నిర్వహించిన షోడషాభిషేకాల్లో పాల్గొన్నారు. వారికి ఆలయ మర్యాదలతో ఏర్పాట్లును ఇఒ టి.బాపిరెడ్డి, డెప్యూటీ ఇఒ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి,టెంపుల్ ఇన్సెపెక్టర్ హరియాదవ్,సిఎస్ఒ నాగభూషనం యాదవ్‌లు పర్యవేక్షించారు.

# గొబ్బెమ్మ ప్రాకారోత్సవం

శ్రీకాళహస్తి,జనవరి 13 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో ధనుర్మాసం సందర్భంగా నిర్వహించే గౌరమ్మ గ్రామోత్సవం సోమవారం ప్రాకారోత్సవంగా నిర్వహించారు.ఉదయం నుంచి ఆలయంలో అభిషేకాల సందడి చోటు చేసుకోవటం వర్షం కురుస్తుండటంతో ఆలయాధికారులు ప్రాకారోత్సవంగా నిర్వహించారు. ఉత్సవంకు గౌరమ్మను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.ఉత్సవ మూర్తిని కన్నులు మిరుమిట్లు గొల్పునట్లు అలంకరించారు. ప్రాకారంలోనే ఉత్సవం నిర్వహించారు.

# న్యూఢిల్లిలో దేవస్థానం స్టాల్

శ్రీకాళహస్తి,జనవరి 13 ప్రభాతవార్త



తెలుగుపండగల ప్రాధాన్యతను ఉత్తర భారత దేశ వాసులకు తెలిసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ నేపధ్యంలో దేవాదాయశాఖ కమిషనర్ ఆదేశానుసారం ఆలయ ఇఒ టి.బాపిరెడ్డి శ్రీకాళహస్తీశ్వరాలయానికి చెందిన ఐదుగురు సిబ్బందిని న్యూఢిల్లిలోని 'ఆంధ్రాభవన్‌లో' స్టాల్ ఏర్పాటుకు పంపారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి సంబంధించిన సమగ్ర సమాచారాన్ని పొందుపరుస్తూ రూపొందించి ముద్రించిన క్యాలెండర్లను,ల్యామినేషన్ ఫోటోలను ప్రసాదాలను అందుబాటులో ఉంచారు.సూపరింటెండెంట్ విజయసారధి సారధ్యంలో నలుగురు సిబ్బందిని అక్కడకు పంపారు. రెండు రో జుల పాటు అంధ్రాభవన్‌లో స్టాల్ నిర్వహిస్తారు. సోమవారం ఆంధ్ర రాష్ట్రంలో బంధం అనుబంధం ఉన్న ఆగర్‌వాల్ స్టాల్‌ను సందర్శించి అభినందించారు.

# సిద్ధార్థ కళాశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం

శ్రీకాళహస్తి,జనవరి 13 ప్రభాతవార్త



శ్రీకాళహస్తిలోని సిద్ధార్థ జూనియర్ కళాశాలలో 1999-2000లో పదవ తరగతి చదివిన విద్యార్థుల ఆత్మీయ సమావేశం సోమవారం భోగిపండగ సందర్భంగా ఏర్పాటు చేసారు.పనబాక హైమ, దివ్య,జయకృష్ణ,చైతన్యల సారధ్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో పూర్వ విద్యార్థులు ఉపాధ్యాయులు జయకుమార్,లేఖ నాదం, కుమార్, రాజులు మాట్లాడుతూ గురువులు తల్లిదండ్రులను పూజించాలని తల్లిదండ్రులను గౌరవించాలని ఇంటిలో వృద్ధాప్యంలో సేవలందించాలి తప్ప వృధ్ధాశ్రమంలో వదలిపెట్టరాదన్నారు. ఎక్కడెక్కడో ఉన్న విద్యార్థులు పాతికేళ్ళ తరువాత కలవటం చిన్ననాటి సంగతులను స్మరించుకోవటం ఒకరినొకరు సన్మానించుకోవటం జరిగింది.

# కన్నుల పండువగా నటరాజస్వామి గ్రామోత్సవం

శ్రీకాళహస్తి,జనవరి 13 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో సోమవారం ఆధ్యాత్మిక వాతావరణం చోటు చేసుకుంది. స్వామి జన్మనక్షత్రం సందర్భంగా ఆలయంలో ప్రత్యేకత చోటు చేసుకోగా నటరాజస్వామికి అభిషేకాల అనంతరం పట్టణంలోని నాలుగు మాడావీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయంలో షోడసాభిషేకాలు ప్రత్యేక పూజలు అందుకున్న నటరాజును చక్కగా అలంకరించి ఉదయం పట్టణంలో ఊరేగింపు నిర్వహించారు. తరువాత గౌరమ్మను చక్కగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. పట్టణంలోని తేరువీధి, నెహ్రూవీధి, బజారువీధి, నగరి వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. దాంతో పట్టణంలో గ్రామోత్సవాల సందడి చోటు చేసుకుంది.ఉత్సవంతో పాటు ఆలయ ఇన్సెపెక్టర్ సుదర్శనం నాయుడు,సూపరింటెండెంట్ నాగభూషణం యాదవ్, దఫేదార్ రాజ తదితరులు పాల్గొన్నారు.

# గాడి తప్పుతున్న ప్రజా పంపిణీ వ్యవస్థ

## రేషన్ బియ్యం అందక పేదల ఆకలి కేక

సత్యవేడు, జనవరి 13 ప్రభాతవార్త:

సత్యవేడు మండలంలో ప్రజా పంపిణీ వ్యవస్థపై పర్యవేక్షణ కొరవడింది. కొంత డీలర్లు ఏకంగా పేదల నోట్లో మట్టి కొట్టి బియ్యాన్ని స్మగ్లర్ల చేతుల్లో పెడుతున్నారు. ఇటీవల శ్రీసిటీ పోలీసులు మినీ టెంపుల్ బియ్యాన్ని పట్టుకోవడం కూడా తెలిసింది. ఆ కేసులు ఇద్దరు డీలర్లు కీలక పాత్ర పోషించారని పోలీసుల విచారణలో తేలింది. ఇంత వరకు వారిపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. కనీసం డీలర్ల సమావేశం ఏర్పాటు చేసి హెచ్చరికలు కూడా చేయలేక లేని అధ్వానపు పరిస్థితిలో అధికార యంత్రంగ ఉండడం చర్చకు దారి తీస్తోంది. ఇక నెలసరి ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా జరిగే వస్తువుల సరఫరాపై ర్పత్యేక ప్రకటనలుకూడా చేయడం లేదు. ముఖ్యంగా మల్లవారిపాళెం ఈస్ట్ పంచాయతీ వాసులకు రేషన్ బియ్యం, చక్కెర, ఇతర వస్తువులు ఇంత వరకు అందలేదని,డీలర్ ఇస్తాడని లేదు. బండిలో వచ్చి అన్ని ఇస్తారని అధికారులు చెప్పడం తప్ప ఆచరణ దిశగా అడుగులు వేయడం లేదు. పండుగ పూట తమకు పస్తులు తప్పడం లేదని వారు వాపోతున్నారు. జిల్లా విజిలెన్స్ అధికారులు సత్యవేడు, వరదయ్యపాళెం, పిచ్చాటూరు, నాగలాపురం మండలాల్లో ప్రత్యేక నిఘా పెట్టాలని, స్మగ్లింగ్ వ్యవహారాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

**న సులువుగా స్మగ్లింగ్**

సాధారణంగా మండల కేంద్రాల్లోని గిడ్డంగిల నుంచి బియ్యం ఇతర వస్తువులను లారీల్లో డీలర్లకు చేరుస్తున్నారు. అయితే ఆ వాహనాల్లోనే డీలర్లకు కేటాయించిన సరకుల్లో కొంత నిల్వ చేసుకుని అనంతరం ఆ లారీల్లోనే బియ్యంను సూళ్లూరుపేటకఉ తరలించి భారీగా డబ్బులు దండుకుంటున్నారు. ప్రధానంగా సత్యవేడు నియోజకవర్గం పరిధిలో పౌర సరఫరా సరకులు అందించే విషయాలపై ఆయా ప్రాంతాల స్థానిక తహసీల్దార్‌లు ఆకస్మిక తనిఖీలు చేసిన దాఖలాలు ఇంత వరకు లేవు. నెలకు అంతో..ఇంతో ఇచ్చే మామూళ్ళతో తహసీల్దార్‌లో ఉండిపోవడం వల్ల పేదల నోట్లో మట్టి కొట్టి కొందరు డీలర్లు ఈ స్మగ్లింగ్‌కు తెర తీశారు. సత్యవేడు, తమిళనాడుకు సరిహద్దులో ఉండడం, సూళ్లూరుపేట కూత వేటలో ఉండడం వల్ల స్మగ్లింగ్ వ్యవహారాలు మూడు గంటల్లోనే సునాయసనంగా జరిగిపోతున్నాయి. మెగా పూర్తిగా నిద్రపోతుంది. ఈ విషయాలపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి, కలెక్టర్ స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని నియోజకవర్గ వాసులు కోరుతున్నారు.

# ఆంజనేయ ఆలయంలో ముగిసిన ధనుర్మాస భజనలు

తిరుపతి(రవాణ),జనవరి 13ప్రభాతవార్త:



ధనుర్మాసం పురస్కరించుకుని బండ్లవీధి లోని ఆంజనేయస్వామి ఆలయంలో నెలరోజులపాటు చేపట్టిన భజనలు సోమవారం ఉదయంతో ముగిశాయి. గతనెల 14నుండి ప్రారంభమైన ఆధ్యాత్మిక భజన కార్యక్రమాలు భోగి పండుగతో సోమవారం ముగిశాయని రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి తెలిపారు.ముగింపున ఉభయదాత తొండమనాటి వెంకటేశ్‌రెడ్డి, ఆలయ ధర్మకర్తల పులుగోరు ప్రభాకర్‌రెడ్డి ,గుండాల గోపీనాథరెడ్డి ప్రత్యేక పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. జైశ్రీరామ్ నినాదాలతో ఆలయం మార్మోగింది.

# తిరుపతి డివిజన్

# ఘనంగా ముగిసిన బాడీ బిల్డింగ్ ఛాంపియన్షిప్

తిరుపతి విద్య జనవరి 13 ప్రభాత వార్త:



మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఇండోర్ పట్నం నందు లేక్ యు గార్డెన్స్‌లో జరుగుతున్న మిస్టర్ ఇండియా జూనియర్ నేషనల్ బాడీ బిల్డింగ్ మరియు మెన్స్ ఫిజిక్స్ ఛాంపియన్షిప్ ముగిసింది. ఈ పోటీలకు అన్ని రాష్ట్రాల నుండి వందల సంఖ్యలో క్రీడాకారులు పోటాపోటీగా పాల్గొన్నారు. ఈ పోటీలలో 65 కేజీల విభాగం లో తిరుపతి జిల్లాకు చెందిన టీ వెంకటేష్, జి లీలాసాగర్ సిల్వర్ మెడల్ సాధించారు.65 కేజీలు విభాగంలో టీ ఆదినారాయణ ఐదవ స్థానం గెలుపొందారు. గెలుపొందిన వారికి ఏషియన్ బాడీ బిల్డింగ్ ఛాంపియన్షిప్ జాతీయ అధ్యక్షులు ఎలమంచిలి ప్రవీణ్ బహుమతులను అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 20 తేది నుండి 25వ తేదీ వరకు మస్కట్ దేశంలో ఏషియన్ బాడీ బిల్డింగ్ ఛాంపియన్షిప్స్ నిర్వహిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆ అసోసియేషన్ చైర్మన్ మోహన్ సింగ్ రాథోడ్, ప్రధాన కార్యదర్శి జీవీ బాబు,దీపేంద్ర సింగ్ సోలంకి, రితీష్ వీరినాథ్, మస్కట్ దేశం, ఇంటర్నేషనల్ జడ్జ్ షాకిల్, ఎస్ వి శివప్రసాద్, భాస్కర్,శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

# చికెన్ వ్యర్థాల నుంచి ప్రజలను కాపాడండి

పాకాల, జనవరి 13, ప్రభాతవార్త



పాకాల మండల కేంద్రంలో ప్రతి ఆది, సోమవారాలలో మాంసపు దుకాణాల నుంచి దాదాపు ఆరు నుంచి ఎనిమిది టన్నుల కోడ్ల యొక్క వ్యర్థాలు పంచాయతీ వారు ట్రాక్టర్లో తరలిస్తూ ఉన్నారు. ఈ వ్యర్థాల సేకరణలో మామూలు చెత్త తో పాటు చికెన్ వ్యర్థాలు కూడా తరలించటం. ప్రతిరోజు కోసిన కోళ్ల పేగులు కాళ్ళు తలలు మరుసటి రోజు పంచాయతీ వారు తీయడంతో పూర్తిగా కుళ్ళిపోయి తీవ్ర దుర్గంధ పూరితమైన వ్యర్థాలను నగరంలో పలు చికెన్ షాపుల ముందు పంచాయతీ వారు ట్రాక్టర్లు ఆపి కోడి పేగులు సేకరించే ప్రయత్నంలో ట్రాక్టర్‌లో నుంచి వ్యర్థాల తాలూకు నీచు నీళ్లు రోడ్డుపై కారి నగరం లోని రహదారి నిత్యం తీవ్ర దుర్గంధ పూరితంగా మారుతుంది. ప్రతినిత్యం ఈ వ్యర్థాలు సేకరించే పాకాల పంచాయతీ సిబ్బందికి సేఫ్టీ కిట్లు మాస్కులు, గ్లౌజులు పాకాల పంచాయతీ వారు కేటాయించి చికెన్ వ్యర్థ సేకరణ చేయించి సిబ్బంది ఆరోగ్యాలు కాపాడాలి. చికెన్, మటన్, చేపల దుకాణాల నుంచి వ్యర్థ సేకరణకు విడిగా ఒక ట్రాక్టర్ అందులో వాటికి డ్రమ్ములు కేటాయించి అందులో వీటిని సేకరించవలసినదిగా నగర ప్రజలు పంచాయితీ అధికారులను కోరుతున్నారు.

# రోడ్ల పైనే ఇసుక మేటలు మట్టి దిబ్బలు

పాకాల, జనవరి 13, ప్రభాతవార్త



పాకాల మండలం మీదుగా తిరుపతి చిత్తూరు నేషనల్ హైవే 140 ఆరు లైన్ల రహదారిలోని రోడ్లకు ఇరువైపులా ఉన్న సర్వీస్ రోడ్డు వెంబడి కొన్నిచోట్ల మొన్నటి వర్షానికి ఇసుక మేటలు పేరుకొని అలాగే కొన్ని చోట్ల మట్టి దిబ్బలు చెత్త చెదారం పేరుకొని పోయి వున్నా తమకేమీ పట్టనట్టుగా చూసి చూడనట్టు వ్యవహరిస్తున్న ఎన్ హెచ్ 140 రోడ్డు సిబ్బంది, వాహనదారులు బ్రేక్ వేసినపుడు జారి పడి పెద్ద పెద్ద యాక్సిడెంట్లకు ఇసుక కారణం అవుతున్నా ఎన్ హెచ్ అధికారులు మాత్రం సర్వీస్ రోడ్లపై దృష్టి సారించకపోవడం బాధాకరమని వాహనదారులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా హైవే అథారిటీ అధికారులు పరిస్థితిని గమనించి ఎప్పటి కప్పుడు సర్వీస్ రోడ్లు క్లీన్ చేయాలి అని ఈ రోడ్డుపై టోల్ రుసుము చెల్లించి ప్రయాణం చేసే వాహనదారులు కోరుతున్నారు.

# మంత్ర ముగ్ధులను చేసిన బానుజా నృత్యం

తిరుపతి, జనవరి 13 ప్రభాతవార్త ః



ధనుర్మాస పర్వదినాన్ని పురస్కరించుకుని టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహించిన గోదాదేవి కల్యాణ నృత్య రూపకం అధ్యాంతం భక్తి పార్వస్యంతో సాగింది. ఈ సందర్భంగా నృత్య నిపుణరాలైన డాక్టర్ ఉషారాణి శిష్యురాలు కుమారి ఎం. భానుజా బృందం ప్రదర్శించిన నృత్యం ఆహుతులను విశేషంగా ఆకట్టుకుంది. ధనుర్మాస దినాలను పురస్కరించుకుని ఆల్వార్ దివ్య ప్రబంధా ప్రాజెక్టు ఆధ్వర్యంలో ప్రతి ఏడు డిసెంబరు 16 నుంచి 30 రోజుల పాటు అన్నమాచార్య కళామందిరంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా సోమవారం నాడు గోదాదేవి కల్యాణ నృత్య రూపకాన్ని నిర్వహించారు. భానుజా ప్రదర్శించిన హావ భావాలు భక్తుల హర్షధ్వానాలను అందుకున్నాయి.

# స్పీచ్ మారథాన్-వివేకవాణికి స్పందన

తిరుపతి, జనవరి 13 ప్రభాతవార్త ః




స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు గంప నాగేశ్వరరావు, జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్ సోను, సెక్రటరీ రామచంద్రుడు కె. సెక్రటరీ జనరల్ శ్రీధర్ వీరమళ్ళ ఆధ్వర్యంలో జాతీయ యువజన దినోత్సవం రోజు 25 గంటల పాటు ఆన్‌లైన్ స్పీచ్ మారథాన్ నిర్వహించారు.యువతను దృష్టిలో ఉంచుకుని రాబోయే తరానికి ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ విస్డం గొప్పతనాన్ని తెలిపి సర్టిఫికెట్లు అందజేయడం జరిగిందని ఇంపాక్ట్ ఇంటర్నేషల్ విస్డడం క్లబ్ తిరుపతి అధ్యక్షులు, రీజనల్ డైరెక్టర్, ఉయ్ సఫోర్ట్ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ తహ సున్నీసా బేగం తెలిపారు.

# కేవీబీ పురంలో భోగి పండుగ సంబరాలు

కేవీబీ పురం, జనవరి 13 ప్రభాతవార్త:



కేవీబీ పురం మండలంలోని పల్లె ప్రాంతాల్లో సోమవారం ఉదయం భోగి పండుగ సంబరాలు మొదలయ్యాయి. ప్రతి ఇంటి వాకిట్లో కుటుంబ సభ్యులతో సహా భోగి మంటలు వేశారు. భోగి మంటల్లో పనికి రాని వస్తువులను వేసి సంక్రాంతి సంబరాలు భోగి పండుగతో మొదలైంది. ప్రజలు భోగి మంటలు వేసి తమ కుటుంబాల్లో ఆనందం వ్యక్తం చేశారు. భోగి మంటల నుంచి కామాక్షమ్మ దీపాన్ని వెలిగించి ఇంటిలోకి లక్ష్మీదేవికి ఆహ్వానం పలికారు.

# చక్రేశ్వరస్వామికి విశేషాలంకరణ



శ్రీకాళహస్తి, జనవరి 13 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధ ఆలయంగా ఉన్న శ్రీచక్రేశ్వరస్వామి దేవస్థానంలో ఆరుద్ర నక్షత్రం, పౌర్ణమిని పురస్కరించుకుని ఉదయం నుంచి స్వామివారికి సుగంధద్రవ్యాలతో విశేష అభిషేకాలు నిర్వహించి అద్భుతమైన అలంకరణ ఆలయ పూజారి పరమేశ్వరయ్య చేయడం గమనించదగ్గ విషయం. పలువురు భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించుకున్నారు.

## కోడిపందేల స్థావరాలపై పోలీసుల దాడులు



సూళ్లూరుపేట, జనవరి 13 ప్రభాతవార్త : సూళ్లూరుపేట మండలం మతకాముడి గ్రామ శివార్లల్లో ఆదివారం సాయంత్రం సిఐ మురళీకృష్ణ ఆదేశాలతో పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడులకు ఎస్ఐలు బ్రహ్మనాయుడు, కొండప్ప నాయుడు నేతృత్వం వహించి మారు వేషంలో కోడిపందేల స్థావరాలకు వెళ్లారు. కోడిపందేలు నిర్వహిస్తున్న వారిపై ఆకస్మిక దాడులు చేశారు. ఈ దాడుల్లో 20 కోళ్లు, రూ.5,800 నగదు, ఆరు మోటార్‌బైక్‌లు స్వాధీనం చేసుకొని ఏడుగురిని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ బ్రహ్మనాయుడు మాట్లాడుతూ కోడిపందేలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## గోదాదేవికి పల్లకీ సేవ



సూళ్లూరుపేట, జనవరి 13 ప్రభాతవార్త : సూళ్లూరుపేటలో వెలసి ఉన్న శ్రీబాలాంజనేయస్వామి దేవస్థానంలో ధనుర్మాసం ముగింపు వేడుకల్లో భాగంగా సోమవారం భోగిపండుగ నాడు గోదాదేవికి ప్రత్యేక పల్లకీ సేవ నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు దివి లక్ష్మీ నారాయణ ఆధ్వర్యంలో ముందుగా గోమాతకు పూజలు చేశారు. అనంతరం గోవింద నామ స్మరణలతో శ్రీరామ జపాలతో పూజలు చేసి గోదాదేవి పల్లకీ సేవను కన్నుల పండువగా చేపట్టారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం మాజీ ఛైర్మన్ అయితా శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## జీతాల కోసం...మున్సిపల్ కార్మికుల ఆందోళన



వెంకటగిరి, జనవరి 13 ప్రభాతవార్త : జీతాలు ఇవ్వాలని మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు భోగి పండుగ రోజు కూడా ధర్నా చేశారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు చేపట్టిన నిరసన దీక్షలు సోమవారం 9వ రోజుకు చేరాయి. ఈ సిఐటియు జిల్లా నాయకులు వద్దేపల్లి చంగయ్య మాట్లాడుతూ సందర్భంగా మున్సిపల్ కార్మికుల న్యాయమైన సమస్యలు వెంటనే పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ ఇంచార్జ్ కమిషనర్ శ్రీధర్, అలాగే శానిటరీ ఇన్స్పెక్టర్ రామారావు కార్మికుల పట్ల బాధ్యతా రాహిత్యంతో పనిచేస్తున్నారు అని అన్నారు. బూతులు మాట్లాడిన కమిషనర్ వెంటనే క్షమాపణ చెప్పాలని అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా గత పది సంవత్సరముల నుండి ఇక్కడే తిష్ట వేసి విధులు నిర్వహిస్తున్న రామారావును వెంటనే బదిలీ చేయాలని చేసేంతవరకు పోరాటం మారదని అన్నారు.సమస్యల పరిష్కారం గురించి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేపడతామని అన్నారు. సిపిఎం పార్టీ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని అన్నారు. సిఐటియు నాయకులు దొరబాబు మున్సిపల్ యూనియన్ నాయకులు కార్మికులు తదితరులు పాల్గొనడం జరిగింది.

## చినుకు రాలింది...రోడ్డు చెరువైంది



కోట, జనవరి 13 ప్రభాతవార్త : చిన్నపాటి వర్షాలకే రోడ్లన్నీ చెరువులుగా మారుతున్నాయి. సరైన మురుగు కాలువల వ్యవస్థ లేకపోవడంతో కోట, విద్యానగర్‌ల్లో మోకాలిలోతు నీటిలోనే చోదకులు రాకపోకలు సాగిచాల్సిన పరిస్థితి తలెత్తుతోంది. సోమవారం కురిసిన వర్షానికి రోడ్లన్నీ జలయమయ్యాయి.కోటలోని నల్లపరెడ్డి విగ్రహం వద్ద భారీ స్థాయిలో గుంతల్లో వర్షపు నీళ్లు నిలిచిపోవడంతో ద్వి చక్రవాహనదారులు మరింత ఇబ్బందులు పడుతున్నారు. కోట క్రాస్ రోడ్డు వరకు మరింత దాణంగా రోడ్డు తయారైంది. మరో పక్క సంక్రాతి నాటికి రోడ్లు బాగు చేస్తామని ప్రభుత్వం ప్రకటనలు గుప్పించినా ఆచరణలో సాధ్యం కాకపోవడంతో ప్రజలు ప్రభుత్వం తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

## శ్రీ అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు



సూళ్లూరుపేట, జనవరి 13 ప్రభాతవార్త : సూళ్లూరుపేటలోని శ్రీ అయ్యప్ప దేవస్థానంలో అయ్యప్ప మండల దీక్షను పురస్కరించుకొని సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి విగ్రహానికి అభిషేకాలు చేయడంతో పాటు ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం స్వామివారికి సాయంత్రం 18 మెట్లకు పడికట్ల పూజను అయ్యప్ప భక్తుల శరణ ఘోషల మధ్య శాస్త్రోక్తంగా నిర్వహించారు. టిటిడి బోర్డు మాజీ సభ్యులు వేనాటి రామచంద్రారెడ్డి నేతృత్వంలో ఈ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## వీధుల్లో భోగి మంటలు...ఊరూవాడా పండుగ సందడి



కోట, జనవరి 13 ప్రభాతవార్త : కోట మండలంలో సోమవారం భోగి పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఉదయాన్నే భోగి మంటలు వేశారు. ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అయితే వర్షం కారణంగా మండలంలోని పలు గ్రామాల్లో భోగి మంటలు అనుకున్నంత స్థాయిలో యువత వేయలేకపోయారు. ఉదయం నుంచి తేలికపాటి జల్లులు కురుస్తూనే ఉండటంతో యువత కాస్త నిరుత్సాహపడ్డారు. నగర వాసులు పల్లెబాట పట్టారు. గ్రామీణ ప్రాంతాలు జనాలతో కళకళలాడు తున్నాయి. సంక్రాంతి పండుగ పల్లెలకు సరికొత్త కళ తీసుకొచ్చింది. ఏ ఇంట చూసినా సందడే సందడి కనిపిస్తోంది. ఉద్యోగ, ఉపాధి, వ్యాపారులు, చదువు నిమిత్తం పిల్లాపాపలతో నగరాల్లో ఉంటున్న వారు తరలి రావడంతో తెలుగు లోగిళ్లలో అతి పెద్ద పండుగయిన సంక్రాంతిని తల్లిదండ్రులు, బంధుమిత్రులతో కలిసి జరుపుకునేందుకు స్వగ్రామాలకు చేరుకున్నారు.

## సహకార సంఘాల్లో త్రిసభ్య కమిటీలు

**- ఎమ్మెల్యేల సిఫార్సు కోసం ఆశావహుల యత్నం**

కోట, జనవరి 13 ప్రభాతవార్త : సహకార సంఘాల స్ఫూర్తిని గత వైసీపీ సర్కార్ దెబ్బతీసింది. రైతులకు సేవలు అందించాల్సిన రాజకీయ వేదికలుగా మార్చేసి చోద్యం చూసింది. ఫలితంగా గత ఐదేళ్లుగా వాటి ద్వారా రైతులకు ఎలాంటి భరోసా లభించలేదు. ఈ నేపథ్యంలో సహకార వ్యవస్థ ప్రక్షాళన తర్వాత సంఘాల ఎన్నికలకు వెళ్లాలని ప్రస్తుత కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. దీర్ఘకాలం పాటు త్రిసభ్య కమిటీలు ఏర్పాటు చేసే దిశగా యోచిస్తున్నట్లు సమాచారం. దీంతో అన్ని నియోజకవర్గాల్లో ఆశావహులు త్రిసభ్య కమిటీ పదవుల కోసం పోటీ పడుతున్నారు. తెలుగుదేశం, జనసేన, బిజెపి నాయకులు ఛైర్మన్ పదవుల కోసం పావులు కదుపుతున్నారు. ఎమ్మెల్యే సిఫార్సు కోసం ప్రయత్నాలు ప్రారంభించారు. కూటమి పార్టీల నాయకుల్లో అసంతృప్తి లేకుండా సమన్వయంతో అందరికీ న్యాయం చేసేలా పదవులు కేటాయించే యోచనలో ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ఉన్నారు. కోట మండలంలో ఐదు సహకార సంఘాలు ఉన్నాయి.

## చెరువులకు అమృత భాగ్యం

కోట, జనవరి 13 ప్రభాతవార్త : భూగర్భ జలాలు పరిరక్షణ, వాటిని మరింత పెంపొందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం గ్రామాల్లో చెరువుల అభివృద్ధికి శ్రీకారంచుట్టింది. ఉపాధి హామీ నిధులతో చెరువుల్లో పూడికతీత పనులు చేపట్టనున్నారు. సాగు, తాగునీటి అవసరాలు తీర్చడంతో పాటు పాడి పశువులకు నీటి కొరత లేకుండా చెరువులను అభివృద్ధి చేయనున్నారు. కేంద్ర జలసంరక్షణకు గత ఏడాది నుంచి అమల్లోకి తెచ్చిన అమృత సరోవర్-2తో గ్రామాల్లో నీటి సంరక్షణ పనులు చేపట్టబోతున్నారు. ఈ ఏడాది చేపల చెరువులను అభివృద్ధి చేయనున్నారు. ఇప్పటికే పనులు గుర్తింపు ప్రక్రియ క్షేత్రస్థాయిలో చురుగ్గా సాగుతోంది. చెరువుల్లో పూడికతీత, కరకట్టలు బలోపేతం, నడక మార్గం ఆహ్లాదం కలిగించేలా పచ్చదనం, ప్రజలు కూర్చునేలా బెంచీలు ఏర్పాటు చేయడం వంటి పనులను అమృత సరోవర్-1 కింద చేపట్టారు. ఒక్క చెరువుకు లక్ష నుంచి రూ.25 లక్షలు వరకు ఉపాధి నిధులు వెచ్చించనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. సరోవర్-1 కింద కోట మండలంలోని ఊనుగుంట పాలెంలో గత రెండేళ్ల క్రితం రూ.10 లక్షలతో చెరువు అభివృద్ధి పనులు చేశారు.

## సాంప్రదాయబద్ధంగా భోగి పండుగ వేడుకలు



బాలాయపల్లి, జనవరి 13 ప్రభాతవార్త : మండలంలో వాడవాడలా భోగి పండుగను ఘనంగా జరుపుకొన్నారు. వేకువ జామునే గ్రామస్థులు ఇంటి ముంగిట భోగి మంటను వేశారు. సాంప్రదాయ బద్దంగా భోగిలో తాటాకులు, ఉపయోగించని పాత వస్తువులను వేశారు. యువత పోటాపోటీగా భోగి మంటలు పెద్దవిగా వేశారు. భోగిమంటల సెగతో కాచుకున్న వేడినీటితో కొంతమంది తలస్నానం చేసి కొత్తబట్టలు ధరించి పండుగను జరుపుకొన్నారు. వెంగమాంబ పురం ఇంకా పలు గ్రామాలలో వేకువ జామునే చిన్నారులు, ఉత్తరాయణం ముందురోజుకి చలి విపరీతంగా పెరగడం వలన సాంప్రదాయ బద్దంగా పూర్వకాలం నుంచి మూడు రోజుల సంక్రాంతిలో మొదటి రోజును భోగి మంటలను వేసి పండుగను జరుపుకున్నారు.

## విద్యార్థులకు ఆర్థిక చేయూత



వాకాడు, జనవరి 13 ప్రభాతవార్త : వాకాడు మండలం బాలిరెడ్డిపాలెం గ్రామంలోని భోగి పర్వదినాన్ని పురస్కరించుకొని విద్యార్థిని, విద్యార్థులకు శ్రీ సీతారామ ధార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ప్రవాస భారతీయులు రామిరెడ్డి మధుకిరణ్‌రెడ్డి ఆర్థిక సౌజన్యంతో మనపాటి సుమ, పనబాక శ్రీనాథ్ అనే ఇద్దరు విద్యార్థులకు ఆరువేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అనురూప్‌రెడ్డి, డాక్టర్ సాయికౌశిక్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి చేతుల మీదగా అందజేశారు. ఈ కార్యక్రమంలో దివి అనంత్ ఆచార్యులు మాట్లాడుతూ ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో మనపాటి సుమ 470కి 461 మార్కులు సాధించి నందుకు విద్యార్థిని ప్రతిభ గుర్తించి నగదును ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరామసేన సభ్యులు గురుప్రసాద్, వంశీ, హరీష్‌రెడ్డి, సంస్థ ప్రతినిధి దివి అనంతబాబు తదితరులు పాల్గొన్నారు.

## కారు ఢీకొని మహిళ మృతి!



చిల్లకూరు, జనవరి 13 ప్రభాతవార్త : మండలంలోని జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి రోడ్డు దాటుతుండగా కారు ఢీకొని ముత్యాలపాడు గ్రామానికి చెందిన నారాపరెడ్డి విమీషా (21) మృతి చెందింది. పోలీసులు మేరకు వినీషా కుటుంబ కలహాలతో చిల్లకూరు పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇచ్చేందుకు వస్తున్న క్రమంలో కారు ఢీకొన్న సంఘటన చోటుచేసుకుంది. ప్రమాదం జరిగిన వెంటనే చిల్లకూరు ఎస్ఐ సురేష్ బాబు సిబ్బందితో కలిసి 108 ద్వారా నెల్లూరు అపోలో హాస్పిటల్ కి తరలించి చికిత్స అందిస్తున్న క్రమంలో సోమవారం మృతి చెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఆనందోత్సాహాలతో భోగి



సూళ్లూరుపేట, జనవరి 13 ప్రభాతవార్త : సూళ్లూరుపేటలో ఆనందోత్సాహాలతో సంక్రాంతి సంబరాల్లో ముందు పండుగ అయిన భోగి పండుగను సోమవారం జరుపుకున్నారు. ఒకరినొకరు భోగి పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం పలు దేవాలయాల్లో జరిగే పూజలకు హాజరయ్యారు. మండలంలోని అన్ని గ్రామాల్లో భోగి పండుగ వేడుకలు జరుపుకున్నారు.

## తడ పల్లెల్లో భోగి పండుగ సందడి



తడ, జనవరి 13 ప్రభాతవార్త : తడ మండలంలో సోమవారం భోగి పండుగ ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారుజామునే తాటాకులు, పలు వస్తువులు భోగి మంటల్లో వేశారు. ప్రజలు మండలంలోని ఆలయాలకు వెళ్లి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఇతర ప్రాంతాల్లో ఉద్యోగాలు, వ్యాపారాల్లో ఉన్న వారంతా పల్లెబాట పట్టారు, దీంతో గ్రామాలు కళకళలాడాయి.

## ఘనంగా భోగి పండుగ వేడుకలు



వెంకటగిరి, జనవరి 13 ప్రభాతవార్త : మండలంలో ఘనంగా భోగి పండుగ వేడుకలు జరిగాయి. అందరి ఇళ్ళ ముంగిట భోగి మంటలు వేసి పండుగను వైభవంగా జరుపుకున్నారు. అందరి ఇళ్ళ ముంగిట భోగి మంటలు వేసి సంబరాలు నిర్వహించారు. భోగి వేసే సమయంలో తెల్లవారుజామున నాలుగున్నర గంటలకు వర్షం పడటంతో భోగిమంటల వేసేందుకు అంతరాయం కలిగింది. జల్లులతో కూడిన వర్షం పడింది. ఘనంగా భోగి పండుగ వేడుకలు జరిగాయి.

## దువ్వూరు మృతి పార్టీకి తీరని లోటు : ఎమ్మెల్యే



చిల్లకూరు, జనవరి 13 ప్రభాతవార్త : టిడిపి సీనియర్ నాయకుడు దువ్వూరు కృష్ణారెడ్డి మృతి చెందడం పార్టీకి తీరని లోటు అని ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం చిల్లకూరు మండలం బల్లవోలు గ్రామంకు చెందిన సీనియర్ నాయకులు, దువ్వూరు కృష్ణారెడ్డి ఆకస్మిక మరణం చాలా బాధాకరం అని, వారి ఆత్మకు శాంతి చేకూరాలన్నారు.

## శ్రీశ్రీశ్రీ ముత్యాలమ్మ ఆలయంలో విశేష పూజలు



చిల్లకూరు, జనవరి 13 ప్రభాతవార్త : తూర్పు కనుపూరు గ్రామంలో స్వయంభుగా వెలసి వున్న శ్రీశ్రీశ్రీ ముత్యాలమ్మ అమ్మవారి దేవస్థానం లో శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయనం హేమంత రుతువు మార్గశిర మాసం పుష్య పౌర్ణమి సందర్భంగా సోమవారం ఉదయం 9 గంటల నుండి చండీ హోమం, విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం 7 గంటలకు పల్లకిసేవ వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు దర్శన భాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఉభయకర్తలుగా శ్రీ మూర్తి వీరరాఘవులుశెట్టి, హంసమ్మ (చెన్నై) వ్యవహారించారు. ఈ పూజా కార్యక్రమంలో ఛైర్మన్, ధర్మకర్త మండలి, కార్య నిర్వహణ అధికారి తదితరులు పాల్గొన్నారు.

## కాణిపాకంలో వైభవంగా గోదాదేవి కళ్యాణం



కాణిపాకం, జనవరి 13 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీదేవి, భూదేవి సయిత వరదరాజ స్వామి ఆలయంలో సోమవారం శ్రీగోదాదేవి కళ్యాణం, గ్రామోత్సవం అత్యంత ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా ఆలయంలో సంక్రాంతి సందర్భంగా భోగిపండుగ రోజున గోదాదేవి గ్రామోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఈకార్యక్రమానికి కాణిపాకం చెందిన ధనంజయ యాదవ్ కుటుంబీకులు ఉభయదారులుగా వ్యవహరించారు. వీరు ఉదయం వరుస ఉభయం తీసుకురాగా ఆలయ ఉప ప్రధాన అర్చకులు పరవస్తు శ్రీనివాస భట్టాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ స్వామి అమ్మవార్ల ఉత్సమూర్తులకు ఘనంగా అభిషేకించి ధూపదీప నైవేద్యాలను సమర్పించారు. అలాగే ఆలయంలో స్వామి అమ్మవార్ల ఉత్సమూర్తులను అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ప్రత్యేకపల్లకిపై వుంచి మంగళవాయిద్యాల నడుమ గ్రామ పురవీధుల గుండా ఘనంగా ఊరేగించారు. అనంతరం గోదాదేవి, రంగనాథస్వాములు కళ్యాణోత్స వంను కన్నుల పండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ ఉభయదారులు ధనంజయ యాదవ్ కుటుంబీకులు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు రవి, కాణిపాకం మాజీ సర్పంచ్ మధుసూధన్‌రావు, నాయకులు పూర్ణచంద్రరావు, ఆలయ ఉభయదారులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

## వైభవంగా అరికట్ల ఉత్సవం



శ్రీకాళహస్తి,జనవరి 13 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే ఉత్సవాల్లో అర్చకులు, పరిచారకులకు సంబంధించిన ముఖ్యమైన ఉత్సవం అరికట్ల ఉత్సవం. ఈ ఉత్సవానికి సంబందించి అర్చకులు ఇలా వివరిస్తున్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో అరికట్ల ఉత్సవంకు సంబంధించి సోమవారం ఆలయంలో సంబరాలు చోటుచేసుకున్నాయి. చొక్కాణి సందర్భంగా శివయ్యకు అగ్నితో ఆరాధించే విధానం ఒకటి ఉంది.ఈ మేరకు గత నెల చొక్కాణి ఉత్సవం నిర్వహించారు. తాటిమాను కాల్చిన తరువాత మిగిలిన కాలిన మొక్కలు తాటిచెట్టు నాటిన గుంతలో వేసి పూడ్చి పెడతారు.స్వామి జన్మనక్షత్రం ఆరుద్ర రోజు 'ఆరికట్ల ఉత్సవాన్ని'అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉత్సవంను ఇలా సాగించారు. ఆలయంలోని కంచుగడప వద్ద వెలసిన వినాయక ఆలయం నుంచి తొమ్మిది దుత్తల్లో నేతిని నింపుకొని పరిచారకులు,అర్చకులు నృత్యాలు, నాట్యాలుచేస్తూ ఆడుతూ పాడుతూ వచ్చారు. మొదట మూడు దుత్తలో నేతిని నింపి నంది విగ్రహం వద్ద చొక్కాణి చెట్టు కాల్చిన చోటకు తీసుకొచ్చారు.అక్కడ నేతి దుత్తలను పగలగొట్టారు.అలా మూడు సార్లు తొమ్మిది దుత్తల్లో నేతితో ఆలయ ఆవరణలో ఉత్సవం నిర్వహించారు. ఇలా చొక్కాణి గుంటలో వేసిన మొక్కలపై నేతిని పోసి హోమాలు వెలిగించి సంబరాలు జరుపుకున్నారు.ఈ కార్యక్రమాల్లో ఆలయ ప్రధానార్చకులు డాక్టర్ స్వామినాధన్ గురుకుల్, ఆలయ అర్చకులు సంబంధం, కరుణాకర్ గురుకుల్‌లు పాల్గొన్నారు. ఆలయ ఇన్సెపెక్టర్ హరియాదవ్, పర్యవేక్షించారు.



సోమవారం ప్రత్యేక ఆలంకరణలో మార్కెట్ కమిటీ ఆవరణలో వెలసియున్న శ్రీ సంపతీశ్వరస్వామి

## 'బాబన్నా...సత్యవేడు రోడ్ల దుస్థితి చూడన్నా...!

**-ఏ అధికారికి చెప్పినా స్పందన లేదు**



సత్యవేడు, జనవరి 13 ప్రభాతవార్త: బాబన్నా...మీరిచ్చిన ఆదేశాలు సత్యవేడు నియోజకవర్గంలో పట్టించుకునే దిక్కే లేదు. సంక్రాంతి లోపు అధ్వానపు రోడ్లు అందంగా చేస్తామని, ఆ దిశగా ఆదేశాలు ఇచ్చామని మీరు చెప్పారు. ఆ ఆదేశాలను, ఆ దిశగా చర్యలు తీసుకోవడంలో ఇక్కడ ఏ అధికారి ముందుకు రావడం లేదు. సత్యవేడు-ఊత్తుకోట రోడ్డు పూర్తిస్థాయిలో గుంతలమయంగా మారింది. అప్పుడప్పుడు ఈ రోడ్ల మీద తమిళనాడుకు ఎర్రమట్టి రవాణా సాగుతోంది. దాంతో పాటు పీవీ పురం పంచాయతీ నుంచి జోరుగా కంకర, కంకర దువ్వ టన్నుల కొద్దీ నిత్యం తమిళనాడుకు సాగుతోంది. బిల్లులో ఒక లెక్క బిల్లు లేకుండా మరో లెక్క అన్నట్లు జోరుగా ఈ కంకర వ్యాపారం సాగుతోంది. రోడ్ల మీద గుంతలను పూడ్చే దిక్కేలేదు. దాంతో పాటు వెంకటరాజుల కండ్రిగ-టీపీ పాళెం రోడ్డు, బీరకుప్పం -నాగలాపురం రోడ్డు, టీపీ కోట-పీవీ పురం రోడ్డు దుస్థితికి చేరింది. స్థానిక ఆర్‌అండ్‌బీ అధికారులను కనీసం మరమ్మతులు చేయాలని పలుమార్లు కోరుతున్నా ప్రయోజనం లేదు. పెద్ద పండుగ..గుంతలు లేని రోడ్లు చేస్తామని మీరిచ్చిన ఆదేశాలను సత్యవేడు ప్రాంతంలో అమలు కావడం లేదు. తమిళనాడుకు సరిహద్దులో ఉన్న సత్యవేడు నియోజకవర్గంలో గత ఆరు మాసాలుగా చెప్పుకోదగ్గ ఒక్క పని కూడా జరగలేదని ప్రజలు వాపోతున్నారు. శ్రీసిటీకి దగ్గరలో ఉన్న ఈ రోడ్ల దుస్థితిపై స్పందించే దిక్కు లేకపోవడం వల్ల నిత్యం పరిశ్రమలకు వెళ్లే కార్మికులు, ఉద్యోగులు, ఇతర సిబ్బంది పడే అవస్థలు వర్ణనా తీతం కనీసం ప్రధాన రోడ్ల మీద గుంతలను కూడా పూడ్చడం లేదు. ఏఈఇల కొరత, ఇన్‌చార్జిల బాధ్యతలు సత్యవేడు ప్రాంతంలో ఆర్‌అండ్‌బీ శాఖకు బైపాస్ రోడ్డు కాగితాలకే పరిమితమైంది. భూ సేకరణ, ఇతర పనులు చక చకా సాగి మిగిలిన విషయాలు అటకెక్కించారు. ఇంద్రుడు, చంద్రుడు, పేదల పక్షపాతి, ప్రముఖ పారిశ్రామికవేత్త వంటి బిరుదులతోపలువురు నియోజకవర్గంపై పెత్తనం చలాయిస్తున్నారే కాని ప్రగతి విషయాలపై,భూ కబ్జాలను అరికట్టడంలో ఏ మాత్రం శ్రద్ధ చూపడం లేదని ప్రజలు వాపోతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించి రోడ్ల మరమ్మతులు, సత్యవేడులో ఆర్డీవో కార్యాలయం ఏర్పాటు, వంద పడకల ఆస్పత్రి నిర్మించి ఇక్కడ పేదల ఇబ్బందులు తొలగిస్తారని నియోజకవర్గ వాసులు ఎదురుచూస్తున్నారు.

## "తిరుమల విజన్ -2047"!...రూపు మారనున్న ఆర్టీసి బస్టాండ్లు

**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:**

తిరుమలక్షేత్రాన్ని మరింతగా అభివృద్ధిచేయడంలో భాగంగా తిరుమల విజన్ 2047లో యాత్రికుల సౌలభ్యం కోసం రెండు ఆర్టీసి బస్టాండ్‌లు రూపురేఖలు కూడా మారనున్నాయి. కొండపై కొన్ని దశాబ్ధాల క్రిందటే ఆర్టీసి చిన్నబస్సులు ఘాట్‌లో నడుపుతున్న సమయంలోనే జిఎన్‌సి టోల్‌గేట్ దాటిన తరువాత అంజనాద్రినగర్‌లో బాలాజీ బస్టాండును నిర్మించారు. అప్పటి అవసరాలకు తగ్గట్లు ఈ బస్టాండులో యాభై వరకు బస్సులు ఆగేందుకు వీలుంది. మూడునాలుగుదశాబ్దాల క్రిందట వరకు రోజుకు 20వేల మంది వరకు భక్తులు బస్సుల్లో తిరుమలకు చేరుకునేవారని తెలుస్తోంది. దీన్నిబట్టి అప్పటి అవసరాలకు తగ్గట్లు 30వరకు చిన్నపాటి ఆర్టీసి బస్సులు ఘాట్‌లో సులభంగా ప్రయాణించేలా బాలాజీబస్టాండునే నిర్వహిస్తూ వచ్చారు. ఆ తరువాత తిరుమలకు చేరుకునే భక్తుల సంఖ్య అనూహ్యంగా పెరగడంతో రద్దీకి తగ్గట్లు కొండపైనే ఆలయానికి ఎదురుగా సమీపంలో రాంభగీచా బస్టాండును తాత్కాలికంగా నిర్మించారు. ఇక్కడ బస్సులన్నీ ఉన్న అరకొర విశాలమైన స్థలంలోనే ఆపేవారు. ఇలా ఇప్పుడు రోజుకు లక్షమంది వరకు భక్తులు తిరుమలకు వస్తున్నారు. వీరిలో 50వేలమంది వరకు భక్తులు ప్రతిరోజూ ఆర్టీసి బస్సుల్లోనే ప్రయాణిస్తున్నారు. ఇక టిటిడి ఉద్యోగులు, సిబ్బంది కూడా ఆర్టీసిబస్సులపైనే ఆధారపడుతున్నారు. రోజుకు 450వరకు బస్సులు తిరుమల-తిరుపతి మధ్య నడుస్తున్నాయి. ఇంకా విద్యుత్‌తో నడిచే బస్సులు 70వరకు ఉన్నాయి. పెరిగిన భక్తుల సంఖ్యకు తగ్గట్లు ఆర్టీసిబస్సులు పెరిగాయి. ఇప్పుడు వస్తున్న బస్సులు బాలాజీ బస్టాండు, రాంభగీచా బస్టాండుల్లో ఆపేందుకు స్థలం సరిపోవడం లేదు. రెండేళ్ళ క్రిందట బాలాజీబస్టాండ్‌ను కొంతవరకు మార్పుచేసి అభివృద్ధి పనులు చేపట్టారు. యాత్రికులు వేచివుండేందుకు సులభంగా ఇనుప కుర్చీలు వేయించారు. బస్టాండు ప్రాంగణాన్ని టైల్స్‌తో అలంకరించారు. ఇలా మార్పులు చేసినా ఇప్పుడు తిరుమల విజన్ -2047లో భాగంగా కొండపై ఉన్న రెండు ఆర్టీసి బస్టాండ్‌లను ఆధునీకరించాలని ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఈ బస్టాండ్‌లను పడగొట్టి ఆ స్థానాల్లో అధునాతన కొత్త బస్టాండ్‌లు విజన్‌లోనే నిర్మించేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. తిరుమల-తిరుపతి మధ్య డీజిల్‌తో నడిచే బస్సులు 450వరకు , విద్యుత్‌తో నడిచే బస్సులు 70వరకు ఘాట్‌లో ప్రతిరోజూ రాకపోకలు సాగిస్తున్నాయి.

## బాధితుల వేదన విని ఓదార్చిన ముఖ్యమంత్రి

**నారావారిపల్లికి చేరుకున్న పలువురు అర్జీదారులు**



చంద్రగిరి, జనవరి 13 ప్రభాతవార్త: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు తమ కష్టాన్ని చెప్పుకోవాలని వచ్చిన బాధితుల వేదనను విని ఓదార్చిన ముఖ్యమంత్రి న్యాయం చేస్తానని చెప్పడంతో వారంతా ఆయనకు చేతులు జోడించి కృతజ్ఞతలు తెలిపారు. సక్రాంతి సంబ రాలను సొంతూరులో జరుపుకునేందుకు ముఖ్యమంత్రి తమ కుటుంబ సభ్యులతో కలసి నారావారిపల్లికి చేరుకున్నారు. ఈ సందర్భంగా వేర్వేరుప్రాంతాల నుండి వచ్చిన యువకులు, వృద్ధులు, మహిళల నుండి ముఖ్యమంత్రి స్వయంగా అర్జీలను స్వీకరించారు.

## ఘాట్‌లో తిరగబడిన ఆర్టీసి బస్సు

**-ప్రయాణీకులకు గాయాలు**



తిరుమల,జనవరి 13ప్రభాతవార్తప్రతినిధి: తిరుపతినుండి టిటిడి ఉద్యోగులు, ప్రయాణీకులతో వస్తున్న ఆర్టీసి బస్సు అప్‌ఘాట్‌లో సోమవారం మధ్యాహ్నం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని రోడ్డుకు అడ్డుగా తిరగబడింది. ఈ సంఘటనలో బస్సులోని ప్రయాణీకులు, టిటిడి ఉద్యోగులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. బస్సుడ్రైవర్ లోకేశ్‌కూడా గాయాలకు గురయ్యాడు. శ్రీకాళహస్తిడిపోకు చెందిన ఆర్టీసి బస్సు జోరు వర్షంలో హరిణి వద్ద ఈ ప్రమాదానికి గురైంది. అలిపిరి ఏవిఎస్ఓ రాజశేఖర్, ట్రాఫిక్ సిఐ హరిప్రసాద్ శ్రమించి బస్సును క్రేన్ సాయంతో పక్కకు తరలించారు. పొగమంచు కారణంగా వాహనాలు నిదానంగా ప్రయాణించాలని టిటిడి ప్రచారం చేసింది.

## శ్రీ లక్ష్మి అలంకరణలో పెద్దశేష వాహనంపై ఎల్లమ్మ



చంద్రగిరి, జనవరి 13 ప్రభాతవార్త: శ్రీ లక్ష్మి అలంకరణలో శ్రీ మూలస్థాన ఎల్లమ్మ పెద్దశేష వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. చంద్రగిరి గ్రామదేవత, సత్యప్రమాణాలకు నెలవై కొలువుదీరిన శ్రీ మూలస్థాన ఎల్లమ్మ వారి సంక్రాంతి మహోత్సవాలను ఆలయ ఈఓ మమత వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం ఆలయ అర్చకులు సూరి స్వామి అమ్మవారికి వేకువజామున అభిషేకం జరిపించారు. తదుపరి విశేష అలంకరణ గావించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయ అర్చకులు అమ్మవారి ఉత్సవమూర్తిని వివిధరకాల సుగంధ భరిత పుష్పాలు, బంగారు ఆభరణాలతో విశేష అలంకరణ గావించి పెద్దశేష వాహనంపై అధిష్ఠింపజేశారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, బ్యాండుబాజాల నడుమ వాహనసేవ కన్నుల పండువగా సాగింది. అదేవిధంగా రాత్రి అమ్మవారు శ్రీగజలక్ష్మి అలంకరణలో గజవాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు అమ్మవారికి మంగళహారతులతో కర్పూరనీరాజనాలర్పించి మొక్కులు తీసుకున్నారు.